# లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
LGTV
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094



ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 12, | సంచిక 304, | పేజీలు -12 | మంగళవారం - 09 - సెప్టెంబర్ - 2025 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,


### భారత్‌ను చూసి నేర్చుకోండి.. మోదీ పాలసీపై
## ఇజ్రాయెల్ నిపుణుడి ప్రశంసలు




'దేశ గౌరవం'ను వ్యూహాత్మక ఆస్తిగా మార్చుకోవడంలో మోదీ విజయం సాధించారన్న జకి షలోమ్
ట్రంప్ ఫోన్ కాల్స్‌ను కూడా తిరస్కరించిన మోదీ వైఖరిపై ప్రశంసలు

### రష్యాపై అమెరికా మరింత దూకుడు.. భారత్, చైనాలపై ప్రభావం?

ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపలేకపోవడంపై అసంతృప్తితో ఈ నిర్ణయం




వైట్‌హౌస్‌లో విలేకరి ప్రశ్నకు సూటిగా సమాధానం ఇచ్చిన అమెరికా అధ్యక్షుడు
రష్యా నుంచి చమురు కొనే దేశాలపై సెకండరీ టారిఫ్‌లు విధించే అవకాశం

## ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ

రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ లకు స్థానచలనం
టీటీడీ నూతన ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ నియామకం




ప్రస్తుత ఈవో శ్యామలరావు జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ
రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు




## అసెంబ్లీ సాక్షిగా అక్బరుద్దీన్ ఒవైసీ
### మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు

- కాళేశ్వరంపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్.. ఒవైసీ వ్యాఖ్యల ప్రస్తావన
- కాళేశ్వరంపై రేవంత్ ప్రభుత్వానిది రెండు నాల్కల ధోరణి అన్న కేటీఆర్
- "కూలేశ్వరం" నీళ్లతోనే హైదరాబాద్ దాహం తీరుస్తారా? అని ఎద్దేవా

### ఉపరాష్ట్రపతి ఎన్నికలో
## ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్

ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు బీఆర్ఎస్ సంచలన ప్రకటన
రైతుల సమస్యలపై నిరసనగా ఈ నిర్ణయం
తెలంగాణలో యూరియా కొరతను పట్టించుకోవడం లేదని ఆరోపణ



హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడిన బీఆర్ఎస్ మిగతా..2లో

# ఎవరు అడ్డం వచ్చినా
# ఈ పథకం పూర్తి చేస్తాం

## నల్గొండ ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన

- తాగునీటి సమస్యలు పరిష్కరించడానికే పీజేఆర్ పోరాటాలు చేశారు
- హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చడానికే గోదావరి తాగునీటి పథకం
- వరద నియంత్రణ కోసమే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నిర్మించారు
- రెండేళ్లలో గోదావరి ఫేజ్ 2, 3 పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం



గండిపేట: హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చడానికే గోదావరి తాగునీటి పథకం తీసుకొచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వరద నియంత్రణ కోసమే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నిర్మించారని అన్నారు. తాగునీటి సమస్యలు పరిష్కరించడానికే పీజేఆర్ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా.. ఉస్మాన్‌సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం




## రేవంత్ రెడ్డిపై తెలంగాణ బీజేపీ వేసిన పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు... కీలక వ్యాఖ్యలు

- సుప్రీంకోర్టులో రేవంత్ రెడ్డికి ఊరట
- బీజేపీ వేసిన పరువునష్టం పిటిషన్ కొట్టివేత
- రాజకీయ యుద్ధాలకు కోర్టులు వేదిక కాదన్న సుప్రీంకోర్టు

### హాకీ ఆసియా కప్‌లో భారత్ జయభేరి..
## అభినందించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు

ఆసియా కప్ 2025 ఫైనల్లో భారత్ ఘన విజయం




దక్షిణ కొరియాపై 4-1 తేడాతో గెలుపొందిన టీమిండియా
ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఆసియా కప్ టైటిల్ కైవసం
2026 హాకీ ప్రపంచకప్‌కు అర్హత సాధించిన భారత్

## మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలి


వివరాలు 2లో..



ఈ వారంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా
మేడారం, బాసర ఆలయాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలి
ఆయా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరణ
"మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

### ఆ ప్రాజెక్టుతో ఆదివాసీల ఉనికే ప్రమాదంలో ఉంది: సోనియా గాంధీ

గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ తీవ్ర విమర్శలు




ఇదొక పర్యావరణ విపత్తు అని, ఆదివాసీల హక్కులను కాలరాస్తోందని ఆరోపణ
షోంపెన్, నికోబారీస్ తెగల మనుగడకే ప్రమాదమని తీవ్ర ఆందోళన
లక్షలాది చెట్లను నరికివేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన సోనియా

## కవిత ఎపిసోడ్‌పై కుండబద్దలు కొట్టిన కేటీఆర్




కవిత సస్పెన్షన్‌పై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులు
మా పార్టీ అంతర్గతంగా మాట్లాడి చర్యలు తీసుకుందన్న కేటీఆర్
ఈ అంశం గురించి తాను మాట్లాడదలుచుకోలేదని వెల్లడి




### కేంద్రం మూడు భాషల విధానంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు

- 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2025' కార్యక్రమానికి హాజరైన లోకేశ్
- జాతీయ విద్యావిధానానికి (ఎన్ఈపీ) పూర్తి మద్దతు
- మూడు భాషల విధానం హిందీని రుద్దడం కాదని స్పష్టం చేసిన వైనం
- తాను కూడా మూడు భాషలు నేర్చుకున్న విద్యార్థినేనని వెల్లడి

### సీఎం చంద్రబాబు నాయకత్వంలో
# ఏపీ లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి

- ★ కోయంబత్తూరు పర్యటనపై మంత్రి నారా లోకేశ్ స్పందన
- ★ కోయంబత్తూరు పారిశ్రామికవేత్తలతో సమావేశమైన మంత్రి నారా లోకేశ్
- ★ ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను వివరించిన లోకేశ్
- ★ పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులు, స్నేహపూర్వక విధానాలు
- ★ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ వ్యాపారవేత్తలకు పిలుపు
- ★ తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైతో మంత్రి లోకేశ్ భేటీ
- ★ రాష్ట్ర పర్యటనకు రావాలని అన్నామలైకి ప్రత్యేక ఆహ్వానం




అమరావతి: ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కోయంబత్తూరు పర్యటనపై సోషల్ మీడియాలో స్పందించారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో తనకు తమిళనాడు బీజేపీ నేత అమర్ ప్రసాద్ రెడ్డి, స్థానిక తెలుగు ప్రజలు ఘన స్వాగతం పలికారని, వారి ఆత్మీయత ఎంతో ఆనందాన్ని కలిగించిందని లోకేశ్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. "కోయంబత్తూరులోని పారిశ్రామి కవేత్తలతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలను మిగతా..2లో



## నా కొడుకు రాజకీయాల్లోకి వస్తాడు

### వైఎస్ షర్మిల సంచలన ప్రకటన

షర్మిలతో కలిసి కర్నూలు ఉల్లి మార్కెట్ పర్యటనలో రాజారెడ్డి
వైఎస్ఆర్ వర్ధంతి తర్వాత ఊపందుకున్న పొలిటికల్ ఎంట్రీ ఊహాగానాలు
షర్మిల అధికారిక ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో మొదలైన చర్చ



అమరావతి: వైఎస్ కుటుంబం నుంచి మూడో తరం రాజకీయ ప్రవేశంపై గత కొంతకాలంగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి కచ్చితంగా రాజకీయాల్లోకి వస్తాడని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన ప్రకటన చేశారు. సరైన సమయం వచ్చినప్పుడు రాజారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో అడుగుపెడతాడని ఆమె ప్రకటించారు. ఈ ప్రకటనతో ఏపీ రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. తన తల్లి షర్మిలతో కలిసి రాజారెడ్డి కర్నూలు పర్యటనకు వెళ్లారు. పర్యటనకు ముందు హైదరాబాద్‌లోని మిగతా..2లో

# మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలి

హైదరాబాద్: మేడారం, బాసర ఆలయాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని, ఈ వారంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని అధికారులకు చెప్పారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి ప్రణాళికలపై సీఎం రేవంత్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మేడారం అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. "మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ప్రవేశం, బయటకు వెళ్లే దారి, పార్కింగ్ తదితర ఏర్పాట్లు ఉండాలి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలి. బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధిలో స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి"అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎవరు అడ్డం వచ్చినా ఈ పథకం పూర్తి చేస్తాం

మొదటి పేజి తరువాయి



ఉస్మాన్‌సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో గోదావరి ఫేజ్ 2, 3 పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రజలు చెప్పారని అన్నారు. సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకెళ్తున్నామన్నారు. తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. " ఎవరు అడ్డం వచ్చినా ఈ పథకం పూర్తి చేస్తాం. నల్గొండ ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. ఈ పథకం ద్వారా హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమే కాకుండా, నల్గొండ ఫ్లోరైడ్ సమస్య తీరుతుంది. భారాస రాష్ట్ర సమితి వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరిగింది. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలి. త్వరలో మహారాష్ట్రకు వెళ్లి అక్కడి సీఎంను కలుస్తా." అని సీఎం అన్నారు.

## హాకీ ఆసియా కప్‌లో భారత్ జయభేరి.. అభినందించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు


అమరావతి/హైదరాబాద్: భారత పురుషుల హాకీ జట్టు అద్భుత ప్రదర్శనతో ఆసియా కప్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణ కొరియాపై 4-1 గోల్స్ తేడాతో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి విజేతగా నిలిచింది. ఈ విజయంతో ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆసియా ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా, 2026లో జరగనున్న ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. ఈ చారిత్రక విజయంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంలు హర్షం వ్యక్తం చేస్తూ జట్టుకు అభినందనలు తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భారత జట్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు. డిఫెండింగ్ ఛాంపియన్‌పై ఇంతటి ఘన విజయం సాధించడం దేశం గర్వించదగ్గ క్షణమని ఆయన అన్నారు. ఈ విజయం కేవలం హాకీ జట్టుది మాత్రమే కాదని, యావత్ భారతదేశానిదని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఆసియా కప్ 2025 గెలిచిన భారత పురుషుల హాకీ జట్టుకు అభినందనలు. ఎనిమిదేళ్ల తర్వాత కొరియాపై 4-1 తేడాతో గెలిచి టైటిల్ సాధించడం భారత క్రీడా రంగంలో గర్వించదగ్గ మైలురాయి. యువ క్రీడాకారులకు ఈ విజయం పట్టుదలకు, కృషికి నిదర్శనంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారత హాకీ కీర్తిని మన క్రీడాకారులు ఇలాగే కొనసాగిస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తూ, ప్రపంచకప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా భారత జట్టును అభినందించారు. ఆసియా కప్‌లో అద్భుత విజయం సాధించిన టీమిండియాకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జట్టు సభ్యులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నా కొడుకు రాజకీయాల్లోకి వస్తాడు

మొదటి పేజి తరువాయి

పర్యటనకు ముందు హైదరాబాద్‌లోని నివాసంలో అమ్మమ్మ విజయమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కర్నూలు చేరుకుని, ఉల్లి మార్కెట్‌లో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగానే విలేకరులతో మాట్లాడుతూ షర్మిల తన కుమారుడి రాజకీయ అరంగేట్రంపై అధికారిక ప్రకటన చేశారు. ఇటీవల దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా పులివెందులలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద జరిగిన నివాళి కార్యక్రమంలో రాజారెడ్డి తన తల్లి షర్మిల పక్కనే కూర్చోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి ఆయన రాజకీయ ప్రవేశంపై జోరుగా ప్రచారం సాగుతోంది. తాజాగా కర్నూలు పర్యటనలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనడం, షర్మిల దీనిపై స్పష్టత ఇవ్వడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్లయింది. వైఎస్ రాజారెడ్డి అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. గతేడాది చట్నీస్ వ్యవస్థాపకుడు ప్రసాద్ అట్లూరి మనవరాలు ప్రియా అట్లూరిని ఆయన వివాహం చేసుకున్నారు.

# ఆ ప్రాజెక్టుతో ఆదివాసీల ఉనికే ప్రమాదంలో ఉంది: సోనియా గాంధీ



ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ప్రాజెక్ట్ ఒక "పెద్ద పర్యావరణ విపత్తు" అని అభివర్ణించిన ఆమె, ఇది ఆదివాసీ తెగల హక్కులను కాలరాయడమే కాకుండా, దేశంలోని అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థను నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రముఖ దినపత్రికలో ఆమె ఒక వ్యాసం రాశారు. షోంపెన్, నికోబారీస్ వంటి ఆదిమ తెగల మనుగడకే ప్రమాదం వాటిల్లినప్పుడు దేశ ప్రజల మనస్సాక్షి మౌనంగా ఉండకూడదని సోనియా గాంధీ తన వ్యాసంలో పేర్కొన్నారు. రూ. 2,72,000 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు వల్ల అక్కడి ఆదివాసీ తెగలు, అరుదైన వృక్ష, జంతుజాలానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆమె అన్నారు. "భవిష్యత్ తరాల కోసం ఈ అద్వితీయమైన పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా మనమందరం గళం విప్పాలి" అని ఆమె పిలుపునిచ్చారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో రాజ్యాంగపరమైన, చట్టపరమైన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సోనియా ఆరోపించారు. షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్‌ను సంప్రదించలేదని, గ్రేట్ నికోబార్ గిరిజన మండలి విజ్ఞప్తులను పెడచెవిన పెట్టారని ఆమె విమర్శించారు. భూసేకరణ చట్టం-2013 కింద నిర్వహించిన సామాజిక ప్రభావ మదింపులో షోంపెన్, నికోబారీస్ తెగలను భాగస్వాములుగా చేర్చకపోవడం దారుణమని అన్నారు. పర్యావరణ నష్టంపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం అధికారిక లెక్కల ప్రకారం 8.5 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని, అయితే స్వతంత్ర అంచనాల ప్రకారం ఈ సంఖ్య 32 లక్షల నుంచి 58 లక్షల వరకు ఉండొచ్చని తెలిపారు. దీనికి పరిహారంగా వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న హర్యానాలో మొక్కలు నాటతామనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పైగా ఆ భూమిలో కొంత భాగాన్ని హర్యానా ప్రభుత్వం మైనింగ్ కోసం వేలం వేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. తాబేళ్లు గుడ్లు పెట్టే సున్నితమైన తీర ప్రాంతంలో పోర్టు నిర్మాణం చేపట్టడంపై సోనియా అభ్యంతరం తెలిపారు. ఈ ప్రాంతం భూకంపాల ముప్పు అధికంగా ఉన్న జోన్‌లో ఉందని, ఇక్కడ ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రజలు, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడతాయని ఆమె హెచ్చరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్, అంతర్జాతీయ విమానాశ్రయం, టౌన్‌షిప్, పవర్ ప్లాంట్ నిర్మించనున్నారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్

మాట్లాడిన బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు సురేశ్ రెడ్డి ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే, అన్ని కోణాల్లో ఆలోచించి ఓటింగ్‌లో పాల్గొనకూడదని నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా కొరత రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని, ఈ సమస్యను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలుమార్లు కోరినా వారు విఫలమయ్యారని సురేశ్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వాల వైఫల్యానికి నిరసన తెలిపేందుకే ఈ మార్గాన్ని ఎంచుకున్నామని, బ్యాలెట్‌పై 'నోటా'కు అవకాశం లేనందున ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉంటున్నామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తోందని కూడా ఆయన ఆరోపించారు. రేపు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇద్దరు అభ్యర్థుల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని, వారు తమ రంగాల్లో నిష్ణాతులని సురేశ్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక అభ్యర్థి తమ రాష్ట్రానికి చెందినవారే అయినప్పటికీ, రైతుల సమస్యలకే తమ పార్టీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలను వివరించాను. ప్రస్తుతం ఏపీలో పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను అమలు చేస్తున్నాం. పరిశ్రమదారులు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టుతో రాష్ట్రానికి వచ్చాక నిర్మాణం పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత మాదే. రాష్ట్రంలో పెద్దఎత్తున వాయు, జల, రోడ్డు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రపదేశ్ లాజిస్టిక్ హబ్ గా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న పరిశ్రమ అనుకూల విధానాల వల్ల జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. పరిశ్రమలకు గమ్యస్థానంగా మారిన ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా పిలుపునిచ్చాను" అని లోకేశ్ వివరించారు.

తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైతో మంత్రి లోకేశ్ భేటీ

ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైతో సోమవారం భేటీ అయ్యారు. కోయంబత్తూరులో వీరిద్దరి మధ్య ఈ మర్యాదపూర్వక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అన్నామలైకి లోకేశ్ వివరించారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండటం వల్ల (డబుల్ ఇంజన్ సర్కార్) ఏపీ శరవేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల పనితీరును, వాటి ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని ఆయన తెలియజేశారు. ముఖ్యంగా విద్యారంగంలో తాము అమలు చేస్తున్న సంస్కరణలు, కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని లోకేశ్ తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా చూడాలని, ఇక్కడి పాలనను పరిశీలించాలని అన్నామలైని ఆయన రాష్ట్ర పర్యటనకు ఆహ్వానించారు.

## కేంద్రం మూడు భాషల విధానంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానానికి (ఎన్ఈపీ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. కోయంబత్తూరులో 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2025' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎన్ఈపీలోని మూడు భాషల విధానాన్ని గట్టిగా సమర్థించారు. ఈ విధానం హిందీని తప్పనిసరిగా రుద్దే ప్రయత్నం కాదని, విద్యార్థులు మూడు భాషలు నేర్చుకునేందుకు ప్రోత్సహించే మంచి అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. "నేను కూడా మూడు భాషలు నేర్చుకున్న విద్యార్థినే. ఇప్పుడు నా కొడుకు కూడా అదే చేస్తున్నాడు. ఈ రోజుల్లో పిల్లలు ఐదు భాషల వరకు నేర్చుకుంటున్నారు. వారికి నచ్చిన జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషలు నేర్చుకుంటే ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి" అని ఆయన వివరించారు. పిల్లలకు ఇష్టమైన భాషను నేర్చుకునే స్వేచ్ఛ ఇవ్వాలని, దానిపై రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమైన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. ఆ సమావేశంలో మాతృభాషకు ఇవ్వాల్సిన ప్రాధాన్యంపై చర్చ జరిగిందని తెలిపారు. "ఒక భారతీయుడిగా నాకు మాతృభాష విలువ తెలుసు, అదే సమయంలో హిందీ నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలూ తెలుసు" అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల ఆసక్తి మేరకు ఒడియా, తమిళం, కన్నడ మాధ్యమాల్లో బోధన చేపట్టేందుకు ఆదేశాలు ఇస్తున్నాం అని వెల్లడించారు.

## 70కి పైగా బీసీ కుల సంఘాల నేతలతో కవిత భేటీ



హైదరాబాద్: బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, ఇందుకోసం ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో ఈరోజు ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని బీసీ సంఘాలను కలుపుకొని, రిజర్వేషన్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు ప్రధానంగా చర్చించారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ.. అభ్యర్థుల బలాలు ఎలా ఉన్నాయంటే!



ఢిల్లీ: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానంభర్తీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ పదవి కోసం ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి లు పోటీ పడుతున్నారు. సెప్టెంబర్ 9న ఎన్నిక జరగనుంది. అయితే, అధికార ఎన్డీయేకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అతీతంగా ఎంపీలు ఓటు వినియోగించుకోవాలని విపక్ష అభ్యర్థి ప్రచారం చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నికపై కాస్త ఉత్కంఠ నెలకొంది. ఉపరాష్ట్రపతి ఎన్నికలో రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరిస్తారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశమూ ఉంటుంది.

ఎన్డీయే - ఇండియా..

లోక్‌సభ 542, రాజ్యసభలో 239 సభ్యులు కలిసి మొత్తం ఎలక్టోరల సంఖ్య 781. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. మెజార్టీ మార్కు 391. అధికార ఎన్డీయే కూటమికి ఇప్పటివరకు 422 సభ్యుల బలముంది. దీంతో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ (11 మంది సభ్యులు).. ఎన్డీయేకు మద్దతు ఇస్తుండడంతో మెజార్టీ పెరగనుంది. మరిన్ని పార్టీలు మద్దతు తెలిపే అవకాశం ఉంది. విపక్షాల ఇండియా కూటమికి 311 మంది బలముంది. ఇతరులు 45 మంది ఉన్నారు. వీరితో సహా కొన్ని పార్టీలు మద్దతిచ్చినా విపక్ష అభ్యర్థి విజయానికి దూరంగానే కనిపిస్తున్నారు. దీంతో పార్టీలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయాలని విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

ఇతర పార్టీలు ఎటువైపు..?

మరోవైపు ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు భారత రాష్ట్ర సమితి (%దీ=ూ%) తాజాగా ప్రకటించింది. దీంతో నలుగురు సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. ఏడుగురు ఎంపీలున్న బిజు జనతాదళ్ (%దీజీణ%) ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ (మిజోరం) వంటి పార్టీలకు ఒక్కో సభ్యులున్నారు. విపక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ఆమ్‌ఆద్మీ (10 మంది ఎంపీలు) ప్రకటించినప్పటికీ.. ఎంపీ స్వాతి మాలివాల్ ఆ పార్టీతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది.

## భారత్‌ను చూసి నేర్చుకోండి.. మోదీ పాలసీపై ఇజ్రాయెల్ నిపుణుడి ప్రశంసలు

ఢిల్లీ: అంతర్జాతీయ సంబంధాల్లో 'దేశ గౌరవాన్ని' ఒక వ్యూహాత్మక ఆస్తిగా ఎలా కాపాడుకోవాలో భారత్ నుంచి ఇజ్రాయెల్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆ దేశానికి చెందిన ప్రముఖ రక్షణ రంగ నిపుణుడు జకి షలోమ్ అభిప్రాయపడ్డారు. మిస్‌గవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ సెక్యూరిటీలో సీనియర్ ఫెలోగా పనిచేస్తున్న ఆయన, 'జెరూసలెం పోస్ట్'కు రాసిన ఒక వ్యాసంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని కొనియాడారు. పాకిస్థాన్‌తో ఘర్షణలు, అమెరికా విధించిన టారిఫ్‌ల వంటి క్లిష్ట సమయాల్లో ప్రధాని మోదీ దృఢమైన వైఖరిని ప్రదర్శించారని షలోమ్ గుర్తుచేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను కూడా మాట్లాడేందుకు నిరాకరించడం ద్వారా, తన దేశ గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారనే బలమైన సందేశాన్ని మోదీ పంపారని ఆయన వివరించారు. "దేశ గౌరవం అనేది కేవలం విలాసవంతమైన విషయం కాదు, అదొక కీలకమైన వ్యూహాత్మక ఆస్తి. మోదీ చర్యలు కఠినంగా అనిపించినా, భారత్‌ను తక్కువగా చూడటాన్ని అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు" అని షలోమ్ తన వ్యాసంలో పేర్కొన్నారు. మరోవైపు, ఖాన్ యూనిస్‌లోని నాస్సెర్ ఆసుపత్రిపై దాడి విషయంలో ఇజ్రాయెల్ వైఖరి గందరగోళంగా, ఆత్రుతతో కూడుకున్నదిగా ఉందని ఆయన విమర్శించారు. ఇజ్రాయెల్ స్పందన కారణంగా అమాయకులను చంపామన్న సంకేతాలు ప్రపంచానికి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దాడిలో 20 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ప్రదర్శిస్తున్న నిబద్ధత, స్పష్టత ఇజ్రాయెల్‌కు ఆదర్శం కావాలని షలోమ్ సూచించారు.

## రష్యాపై అమెరికా మరింత దూకుడు.. భారత్, చైనాలపై ప్రభావం?

ఢిల్లీ: ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యాపై మరింత ఒత్తిడి పెంచేందుకు అమెరికా సిద్ధమవుతోంది. రష్యాపై రెండో దశ ఆంక్షలు విధించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం స్పష్టం చేశారు. ఈ చర్యలు అమల్లోకి వస్తే రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు, ఆ దేశం నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్న భారత్ వంటి దేశాలపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆదివారం వైట్‌హౌస్‌లో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ సూటిగా సమాధానమిచ్చారు. "రష్యాపై రెండో దశ ఆంక్షలకు మీరు సిద్ధంగా ఉన్నారా?" అని అడగ్గా, "అవును, నేను సిద్ధంగా ఉన్నాను" అని ఆయన బదులిచ్చారు. అయితే, ఈ ఆంక్షలు ఎలా ఉంటాయనే దానిపై ఆయన ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. తాను అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ యుద్ధాన్ని వేగంగా ముగించగలనని గతంలో ప్రకటించిన ట్రంప్, ఆ దిశగా పురోగతి లేకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే రష్యాను కట్టడి చేసేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా, యూరోపియన్ యూనియన్ కలిసి 'సెకండరీ టారిఫ్‌లు' విధించవచ్చని సూచించారు. ఈ చర్యల ద్వారా రష్యా ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చి, అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను చర్చల టేబుల్‌కు రప్పించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రష్యా నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్, చైనాలు ప్రధానమైనవి. ఇప్పటికే రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నందుకు గత నెలలో భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఎగుమతులపై ట్రంప్ ప్రభుత్వం శిక్షణాత్మక సుంకాలను విధించిన విషయం తెలిసిందే. "ఇప్పటికే రష్యాకు వందల బిలియన్ల డాలర్ల నష్టం కలిగించాం. ఇంకా రెండో, మూడో దశల ఆంక్షలు మిగిలే ఉన్నాయి" అని ట్రంప్ గత బుధవారం వ్యాఖ్యానించారు. ఆయన తాజా ప్రకటనతో ఆంక్షల అమలు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్‌ల బదిలీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు గత కొన్ని రోజులుగా తీవ్ర కసరత్తు చేశారు. బాగా పని చేసిన వారిని ప్రోత్సహించేలా నిర్ణయం తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఈ మేరకు తితిదే ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈవోగా ఉన్న శ్యామలరావును జీఏడీ ముఖ్యకార్యదర్శిగా నియమించింది. అంతేకాకుండా.. రోడ్లు భవనాలు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు, రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేశ్‌కుమార్ మీనా, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, అటవీ, పర్యావరణశాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంతరామ్, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శిగా సౌరభ్ గౌర్, ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్ , పరిశ్రమలు, కార్మికశాఖ కమిషనర్‌గా శేషగిరిబాబు, రెవెన్యూ (ఎండోమెంట్) కార్యదర్శిగా హరి జవహర్‌లాల్ నియమితులయ్యారు.

## అసెంబ్లీ సాక్షిగా అక్బరుద్దీన్ ఒవైసీ మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదని కాంగ్రెస్ నేతలు పదేపదే ఆరోపిస్తుండగా, ప్రభుత్వం విడుదల చేసిన పుస్తకంలోనే 20 లక్షల ఎకరాలకు నీరు అందించినట్లు పేర్కొన్నారని అక్బరుద్దీన్ సభలో నిలదీసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. కాళేశ్వరం బ్యారేజీ కొట్టుకుపోయిందని చేస్తున్న ప్రచారాన్ని కూడా కేటీఆర్ ఖండించారు. 12 లక్షల క్యూసెక్కుల భారీ వరద వచ్చినా బ్యారేజీ చెక్కుచెదరలేదని, అయినా 20 నెలలుగా దానికి మరమ్మతులు ఎందుకు చేయడం లేదని అక్బరుద్దీన్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. "ఇన్ని రోజులు కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అంటూ విమర్శించిన నోళ్లే, ఇప్పుడు అదే ప్రాజెక్టు నీటితో హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉంది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ చర్యతో కాళేశ్వరం తెలంగాణకు కల్పతరువు, కామధేనువు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరోక్షంగా అంగీకరించినట్లేనని ఆయన అన్నారు. గంధమల్ల రిజర్వాయర్ విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద పెద్ద మాటలు మాట్లాడారని కేటీఆర్ అన్నారు. దాన్ని పూర్తి చేస్తానని శంకుస్థాపన రోజే చెప్పారని, కానీ ఆ గంధమల్ల రిజర్వాయర్‌కు కూడా కాళేశ్వరం అనుసంధాన ప్రాజెక్టయిన కొండ పోచమ్మ సాగర్ నుంచే నీళ్లు వస్తాయన్న నిజాన్ని విస్మరించరాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మూసీ నది పునరుజ్జీవనం కార్యక్రమానికి శంకుస్థాపన మల్లన్న సాగర్ లేదా కొండపోచమ్మ సాగర్ వద్ద చేయాలని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి గుండెకాయను వదిలిపెట్టి గండిపేట వద్ద చేస్తున్నారని విమర్శించారు. గండిపేటకు తెస్తున్నది కాళేశ్వరం జలాలు కాదా? అని నిలదీశారు. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటిని తీసుకువస్తున్నారని అన్నారు.

# రేవంత్ రెడ్డిపై తెలంగాణ బీజేపీ వేసిన పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు...

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై తెలంగాణ బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అంతేకాకుండా, రాజకీయ పోరాటాలకు న్యాయస్థానాలను వేదికగా మార్చవద్దని బీజేపీకి గట్టిగా హితవు పలికింది. కేసును కొట్టివేసిన తర్వాత కూడా వాదనలు కొనసాగించే ప్రయత్నం చేసిన బీజేపీ తరఫు న్యాయవాదిపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రూ.10 లక్షల జరిమానా విధిస్తామని గట్టిగా హెచ్చరించారు. గతేడాది జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో జరిగిన సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి దారితీశాయి. బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలో రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఆయన చేసిన ప్రసంగం తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసిందని ఆరోపిస్తూ బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు హైదరాబాద్ ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు, ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్-125 కింద కేసు విచారణ కొనసాగించవచ్చని సూచించింది. అయితే, ట్రయల్ కోర్టు ఆదేశాలను రేవంత్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. రాజకీయ నాయకుల ప్రసంగాల్లో అతిశయోక్తులు సహజమని, వాటిని పరువు నష్టంగా పరిగణించలేమని స్పష్టం చేస్తూ హైకోర్టు ఆ కేసును కొట్టివేసింది. హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని స్పష్టం చేస్తూ బీజేపీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో ఈ కేసులో రేవంత్ రెడ్డికి పూర్తి ఊరట లభించినట్లయింది.

## కవిత ఎపిసోడ్‌పె కుండబద్ధలు కొట్టిన కేటీఆర్

హైదరాబాద్: సోదరి, పార్టీ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎపిసోడ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తొలిసారి పెదవి విప్పారు. పార్టీలో చర్చించిన తర్వాతే తమ అధినేత ఆ నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత కవిత తొలిసారి మీడియాతో మాట్లాడుతూ.. హరీష్‌రావు, సంతోష్ రావు టార్గెట్‌గా తీవ్ర విమర్శలు చేశారు. ఈ క్రమంలో "రామన్నా.. హరీష్, సంతోష్ మీతో ఉన్నట్టు కనిపించవచ్చు కానీ.. మీ గురించి, తెలంగాణ గురించి ఆలోచించే వ్యక్తులు కాదు .. వాళ్లను పక్కనపెడితేనే పార్టీ బతుకుతుంది.. నాన్న పేరు నిలబడుతుంది.." అంటూ కవిత పేర్కొన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆ సమయంలో కవిత ఆరోపణలపై ప్రశ్న ఎదురైంది. కవిత చేసిన వ్యాఖ్యలపై పార్టీలో చర్చించిన తర్వాతనే అధినేత నిర్ణయం తీసుకున్నారని, ఇంక ఆమెపై స్పందించడానికి ఏం లేదు అని కేటీఆర్ కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారాయన. తాజాగా కవిత ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ.. తనను అక్రమంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. తానెప్పుడూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదు. తనపైపై కుట్రలు జరుగుతున్నాయని చెప్పినప్పుడు.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కనీసం ఫోన్ చేసి అడగాల్సిన బాధ్యత కూడా తీసుకోలేదు. 103 రోజులుగా కేటీఆర్ తనతో మాట్లాడలేదని అన్నారామె. అయితే తనకు నోటీసు ఇవ్వడంపై బాధ కలగడం లేదని.. ఈ వ్యవహారంపై ఎన్నడూ లేనిది తెలంగాణ భవన్‌లో మహిళా నేతలు స్పందించడమే తనకు కొంత ఊరట కలిగించిందని వ్యంగ్యంగా మాట్లాడారామె.

## బీసీ సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం

### -పార్టీలకు అతీతంగా బిసిలంతా ఏకం కావాలి

### -ముక్తకంఠంతో తెలియజేసిన బిసి నాయకులు



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): శేరిలింగంపల్లి డివిజన్‌లోని రత్నా దీప్ సూపర్ మార్కెట్ పైన నిరుషా బ్యాంకెట్ హాల్ లో ఆదివారం బీసీ కులాల, బీసీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తనయుడు డా.అరుణ్ మాట్లాడుతూ..52 సంవత్సరాలుగా బీసీల హక్కుల



కోసం ఆర్ కృష్ణయ్య కృషి చేస్తున్నారని, తమిళ నాడులో అమలైనట్లు దేశవ్యాప్తంగా 42 శాతం రిజర్వేషన్ అమలు కావాలని కృషి చేయాలి అని అన్నారు. అలాగే బీసీలు వ్యాపారాల లో ముందుకు సాగి, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి విదేశాలకు పంపాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ. .రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ నిర్ణయం సరైనదని, బీసీలు సంఘటితమై ఎన్నికలలో బీసీ నాయకులను గెలిపించే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్పొరేటర్ నాగేంద్ర యాదవ్ మాట్లాడుతూ..ఆర్ కృష్ణయ్య స్ఫూర్తితోనే తాను రాజకీయా లలో ఎదిగానని, విద్యార్థుల కోసం ఆయన అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. ఐక్యావేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు శాసనసభ, స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం రావాలని, వ్యూహాత్మక కార్యాచరణతో రాజ్యాధి కారం సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.కే సాయన్న, టి.రామస్వామి యాదవ్, ఓంగురు శ్రీనివాస్ యాదవ్, వీరేశం గౌడ్, కస్తూరి గోపాల్ కృష్ణ, ఏఐసిసి కార్యదర్శి అంబర్ పేట శ్రీనివాస్ యాదవ్, ఎం.రవియాదవ్, మహిపాల్ యాదవ్, జంగం గౌడ్, నాగేశ్వర్ గౌడ్, శ్రీరాములు, సునంద కృష్ణమూర్తి చారి, ప్రశాంత్, సంగమ్మ, మంగు భాయ్, వాసుకి, విజయలక్ష్మి, అనిత, అంజలి, కే.ఎన్.రాములు, సి.డాకయ్య గౌడ్, కె.నరసింహ గౌడ్, లలిత రాణి, సి.రవీందర్ గౌడ్, నాగేశ్వర్ గౌడ్, నర్సింలు, బండి రామకృష్ణ గౌడ్, పి.యాదయ్య, బిసి నాయకులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇంద్రానగర్‌లో మతసామరస్యం

### లడ్డూ వేలంలో ముస్లిం మైనార్టీ సోదరులు సెక్యులరిజం ప్రదర్శన



కూకట్ పల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ పరిధిలో గల ఇంద్రానగర్‌లో గణేశ్ నవరాత్రుల సందర్భంగా జరిగిన లడ్డూ వేలంపాటలో మతసామరస్యం వెల్లివిరిసింది. హిందూ పండుగలో ముస్లిం మైనార్టీ



సోదరులు పాల్గొని సెక్యులరిజం చూపించడం స్థానికులను ఆకట్టుకుంది. ఈద్గాం ఆదర్శనగర్ గణపతి లడ్డూ వేలంలో ముస్లిం మహిళ అమ్రీన్ పాల్గొని రూ.1,88,888కి లడ్డు దక్కించుకోవడం విశేషం. అదే విధంగా నారాయణపేట జిల్లా ముష్టిపల్లిలో ఎండీ పాషా రూ.26 వేల116కి లడ్డూను సొంతం చేసుకున్నారు. మరోవైపు, ఇంద్రానగర్‌లోని లడ్డు వేలంలో స్వర్గీయ ఎండీ మజీద్ తనయుడు ఎండీ నిజాం రూ.42 వేలకు లడ్డు దక్కించుకోవడం జరిగింది. ఆయన బావ, బాలానగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ అర్షద్ సోనుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని సెక్యులరిజం ప్రతీకగా నిలిచారు. హిందూ పండుగలో భాగస్వాములై మతసామరస్యం చాటుకున్న అమ్రీన్, ఎండీ పాషా, ఎండీ నిజాం కుటుంబానికి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలోని గౌరవనీయమైన సాంప్రదాయం సజీవంగా కొనసాగుతున్నదానికి ఇది నిదర్శనమని ప్రజలు అభిప్రాయపడ్డారు.

## తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ..బీసీ యునైటెడ్ ఫ్రంట్

### -సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణలో ప్రకటిస్తున్నట్లు వెల్లడి



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): రాష్ట్రంలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకోనుంది. సెప్టెంబర్ 17న బీసీయుఎఫ్ (బీసీ యునైటెడ్ ఫ్రంట్) పేరుతో పార్టీని ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదివారం ప్రకటించారు. అదే రోజు పార్టీ విధివిధానాలు, జెండా ఆవిష్కరిస్తామని ఆయన వెల్లడించారు. పార్టీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. సెప్టెంబరు 17 అంటే తెలంగాణ విమోచన దినం అని కొంతమంది. విద్రోహ దినం అని మరి కొంతమంది అంటున్నారు. వాస్తవానికి భారత దేశంలో తెలంగాణ విలీనమైన రోజు సెప్టెంబరు 17. ఈ నేపథ్యంలో అదే రోజు పార్టీని ఏర్పాటు చేస్తున్నాం అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వివరించారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. బీసీలను పార్టీలు ఎలా మోసం చేస్తున్నాయో లెక్కలతో సహా వివరిస్తానని చెప్పారు

## అమీన్‌పూర్ మండలంలో డబుల్ రిజిస్ట్రేషన్

### -సమస్యపై ఎమ్మెల్సీ అంజిరెడ్డికి నివాసుల వినతి



పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి): అమీన్‌పూర్ మండలం క్రిష్టా రెడ్డి పేటలోని రెయిన్‌మెడోస్ కాలనీలో డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యపై కాలనీ నివాసులు ఉమ్మడి మెదక్, నిజాంబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ అంజి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంటనే సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించి సమస్యను పరిష్కరించాలంటూ సూచనలు జారీ చేశారు. ఈ మాట్లాడుతూ..నివాసుల చట్టబద్ధ హక్కులు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, స్థానికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి లో బిఆర్ఎస్ పార్టీ లోకి

### -మారబోయినా రవి కుమార్ సమక్షంలో భారీ చేరికలు



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్వామినాథ్, సోమనాథ్ ఆధ్వర్యంలో గోపినగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్, బీజేపీ నుండి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యువనేత మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ తెలంగాణను దిశాహీనంగా నడిపిస్తోంది. కానీ బిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించింది. ప్రజలు ఇప్పుడు మళ్లీ బిఆర్ఎస్ అవసరాన్ని గుర్తించారు అని తెలిపారు. పార్టీలో చేరిన సభ్యులకు బిఆర్ఎస్ విజయవంతమైన పాలన వివరించే పుస్తకాలను రవి యాదవ్ అందజేశారు.బిఆర్ఎస్ విజయాలు ఇలా ఉన్నాయి. 24/7 విద్యుత్ సరఫరా, కల్యాణ లక్ష్మి, షాది దిముబరక్, మహిళలకు 50 శాతం రిజర్వేషన్, దళిత బంధు పథకం, డబుల్ బెడ్ రూం ఇళ్లు, తెలంగాణకు భారతదేశంలో 1వ ర్యాంక్."కాంగ్రెస్ వైఫల్యాలు"ఉద్యోగాలు ఇవ్వడంలో విఫలం, వెల్ఫేర్ పథకాలు నిలిపివేత, ఋణమాఫీ వాగ్దానం నెరవేర్చలేక పోవడం, పింఛన్లు, ఆరోగ్యశ్రీ బీమా అమలు చేయకపోవడం అని రవి యాదవ్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ మాత్రమే తెలంగాణ ప్రజల హక్కులను కాపాడగలదు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో మళ్లీ తెలంగాణను గొప్ప దశకు తీసుకెళ్దాం అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవెన్ రాములు, మల్లేష్ ముదిరాజ్, గడ్డం శ్రీనివాస్, గంగాధర్ గౌడ్, నవీన్ గౌడ్, సాయి నందన్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్, పవన్, వద్దే శ్రీనివాస్, ప్రేమ్, శంకర్, మున్నా, సూర్య, అరుణ్, మంజుల, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు కావలసిన యూరియా ను

## కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయాలి

### తెలంగాణ వ్యవసాయ

### కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ డిమాండ్



షాద్ నగర్:**లోకల్ గైడ్** : ముందస్తుగా రాష్ట్రానికి కావలసిన యూరియా ను అంచనా వేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక లేక విఫలమైనట్టు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ విమర్శించారు. యూరియా రాష్ట్రానికి తెప్పించి రైతులకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర



రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు.వీటి కారణంగా రైతాంగం పై తీవ్ర ప్రభావం పడి క్యూలైన్లో పడిగాపులు కాస్తున్న యూరియా దక్కని పరిస్థితి తక్షణమే సమస్యను పరిష్కరించాల నితెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడం కోసం కేంద్ర బీజేపీ ప్రభుత్వం యూరియా పూర్తిస్థాయిలో సరఫరా చేయకుండా కుట్ర పన్నుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన షాద్నగర్ పట్టణంలోని పిఎసిఎస్ సొసైటీ దగ్గర యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు మరియు రైతులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు వెంటనే కేంద్ర ప్రభుత్వం రైతులకు కావలసిన యూరియా సరఫరాను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కావలసిన యూరియా.. ఖరీఫ్ సీజన్లో లో రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి ఖరీఫ్ కోసం లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినప్పటికీ,ఇప్పటి కేటాయింపే తక్కువగా ఉన్న పరిస్థితి నెలకొందని రైతులను బ్లాక్ మార్కెట్కు నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రేటు ?266 ఉన్న యూరియా బస్తా,బ్లాక్ మార్కెట్లో ?300-340కి అమ్మబడుతోందని, ఇది రైతులపై మరింత భారంగా మారిందని అన్నారు. రాష్ట్రానికి రావలసిన యూరియా కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో తగిన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆరుతడి పంటలకు బదులుగా మొక్కజొన్న, జొన్న.పత్తి లాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసారని, అలాంటి పంటలకు యూరియా అత్యంత కీలకమని గుర్తుచేశారు.. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే రాష్ట్ర రైతులు ఐక్యంగా ఉ ద్యమించాల్సిందేనని పిలుపునిచ్చారు.

## తెలంగాణ విమోచన దినోత్సవ ఆహ్వానం

### -ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మహేందర్




పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి): సెప్టెంబర్ 17న జరగనున్న తెలంగాణ విమోచన దినోత్సవం (హైదరాబాద్ లిబరేషన్ డే) కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వద్ద కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వానించారు. ఈ వేడుకలలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్, మహారాష్ట్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, తదితరులు పాల్గొననున్నారు.

## నిజామాబాదు లో ప్రజావాణికి 114 ఫిర్యాదులు



నిజామాబాద్, లోకల్ గైడ్ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 114



ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న తుది ఓటరు జాబితా

### కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి




నిజామాబాద్, లోకల్ గైడ్ : జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు.



ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గీతం యూనివర్సిటీలో మాక్ డ్రిల్



పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి): విద్యార్థులు, సిబ్బంది భద్రతను పెంపొందించేందు కు, అత్యవసర పరిస్థితుల్లో సంసిద్ధతను బలోపేతం చేయడానికి గాను హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విపత్తు సమయంలో ఒడుపుగా వ్యవహరించడం, గాయపడిన వారిని, వృద్ధులను, మహిళలను సురక్షిత ప్రదేశాలకు తరలించడం వంటి అంశాలపై శిక్షణ



ఇవ్వబడింది. ఆకస్మిక అగ్నిప్రమాదాలు లేదా అనుకోని సంఘటనలు సంభవించినపుడు తక్షణ స్పందన, భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ పర్యవేక్షణ లో సెక్యూరిటీ డైరెక్టర్ (సీనియర్ మేనేజర్) సంతోష్ కుమార్ యాదవ్ అడ్లా నేతృత్వంలో డ్రిల్ జరిగింది. సెక్యూరిటీ అధికారులు, పర్యవేక్షకులు, గార్డులు, వైద్య సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితులలో తీసుకోవలసిన నిర్ణయాత్మక చర్యలపై ప్రదర్శనలతో కూడిన ఆచరణాత్మక శిక్షణ ఇవ్వబడింది. సుమారు 300 మంది విద్యార్థులు, సిబ్బంది ఇందులో పాల్గొని చైతన్యం పొందారు. భద్రతా సంస్కృతిని పెంపొందించడం లో గీతం నిరంతరం కృషి చేస్తోందని, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## చందానగర్ సర్కిల్‌లో ప్రజావాణిలో16 ఫిర్యాదులు స్వీకరణ




శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): చందానగర్ శనివారం 21వ సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన మొత్తం 16 ఫిర్యాదులు స్వీకరించి నట్లు అధికారులు తెలిపారు.విభాగాల వారీగా ఫిర్యాదుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి 9, రెవిన్యూ వింగ్‌కు 1, ఇంజినీరింగ్ వింగ్‌కు 4, ఆల్ సెక్షన్స్‌కు 2 ఫిర్యాదులు అందాయి. హెల్త్, శానిటేషన్, యుసిడి, యుబిడి, ఎలక్ట్రికల్ విభాగాలకు ఏ ఫిర్యాదులు రాలేదు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందు కు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## చందానగర్‌లో అక్షరాస్యత దినోత్సవంలో

### -కన్వీనర్..రామస్వామి యాదవ్



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): చందానగర్ లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూ గుడ్ షెప్పర్డ్ చెవిట, మూగ హైస్కూల్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానవుని సర్వతోముఖాభివృద్ధి విద్య ద్వారానే సాధ్యం అని అన్నారు. అక్షరాస్యత వ్యక్తిగత సాధికారతకు, సామాజిక పురోగతికి మూలస్తంభమని, డిజిటల్ యుగంలో విద్య ప్రాముఖ్యత మరింత పెరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మెర్సి, అధ్యాపకులు శోభ, అంజలి, అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, విష్ణు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి


### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.




నిర్మల్ : లోకల్ గైడ్ : సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనివిద్యార్థులంతా కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్సిసి విద్యార్థులు అధికారులకు స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి వారోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. విద్య వల్ల మనిషి ప్రయోజకుడిగా మారుతాడని వివరించారు. విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం, స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని తెలిపారు. పలు నీతి కథల ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపారు. అనంతరం వారోత్సవ కార్యక్రమాలలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో డి. భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, మెప్మా పీడీ సుభాష్, ఎంఈఓ నాగేశ్వర్ రావు, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్, ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సిసి కెమెరాల ఏర్పాటు పై నిర్లక్ష్యం

-మున్సిపల్ అధికారుల తీరుపై గుండ్ల మహేందర్ రెడ్డి ఆగ్రహం




పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి): బొల్లారం మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయాల్సిన సిసి కెమెరాల విషయంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సీనియర్ నాయకుడు గుండ్ల మహేందర్ రెడ్డి మండిపడ్డారు. రెండు సంవత్సరాల క్రితమే 25 లక్షలు కేటాయించినప్పటికీ ఇప్పటికీ కెమెరాలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించలేదని ఆయన విమర్శించారు. కెమెరాలు ఉన్నా నిరుపయోగంగా మారాయని, ఇది అధికారుల పనితీరులో నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు, కేసుల పరిష్కారంలో పోలీసులకు సాయం కావాలంటే సిసి కెమెరాలు అవసరమని గుర్తుచేశారు. వెంటనే నిధులు విడుదల చేసి సిసి కెమెరాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# భైంసా పట్టణంలో విధి కుక్కల బెడద. ఆందోళనలో ప్రజలు

## మున్సిపల్ కమిషనర్ పై బగ్గుమన్న ప్రజలు



నిర్మల్ సెప్టెంబర్08 (ప్రజా లక్ష్యం ప్రతినిధి) నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని పలు ప్రాంతాల్లో విధి కుక్కల సంచారం పెరగడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బీఫ్ మార్కెట్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ చౌరస్తా, ముస్లిం శాదీఖానా చౌరస్తా తదితర ప్రాంతాలతో పాటు పట్టణంలోని అనేక వీధుల్లో విధి కుక్కల గుంపులు సంచరిస్తుండటం స్థానికులను భయాందోళనలకు గురి చేస్తోంది. ఇంతటితో ఆగకుండా విధి కుక్కలు ఇళ్లలోకి కూడా చేరుతున్నాయి. దీంతో చిన్నారుల ప్రాణాలు సహా ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్, భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్‌పై తీవ్రంగా విమర్శలు చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై తాను త్వరలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.ప్రస్తుతం భైంసా మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పట్టణంలోని అన్ని వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు.సయ్యద్ ఆసిఫ్ మాట్లాడుతూ, స్కూల్ పిల్లలు విధి కుక్కల భయంతో రహదారులపై వెళ్లడానికి భయపడుతున్నారని, అలాగే మార్కెట్‌కి వెళ్లే ప్రజలు కూడా ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు.స్థానిక ప్రజలు కలెక్టర్ అభిలాష అభినవ్‌ను ఈ సమస్యపై వెంటనే స్పందించి విధి కుక్కల పెరుగుతున్న సంఖ్యపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వరద బాధితులకు రిలీఫ్ కిట్ పంపిణి



కామారెడ్డి,లోకల్ గైడ్ : కామారెడ్డి పట్టణంలోని వరద బాధిత కుటుంబాలకు సోమవారం పట్టణంలోని ఇఎస్ఆర్ గార్డెన్స్ లో రామకృష్ణ మట్, ఇన్ఫోసిస్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రిలీఫ్ కిట్ చేశారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మునుపెన్నడు లేని విధంగా జిల్లాలో కురిసిన అధిక వర్షాల కారణంగా వరదలు సంభవించి తీవ్ర నష్టం కలిగించిందని అన్నారు. వరద బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు రామకృష్ణ మట్ ముందుకు వచ్చి ఇప్పటికే వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించడం జరిగిందని తెలిపారు. ఈరోజు కామారెడ్డి పట్టణంలో ఇన్ఫోసిస్ మరియు రామకృష్ణ మట్ వారి సహకారంతో ముంపు బాధిత కుటుంబాలకు 334 రిలీఫ్ కిట్స్ ను అందించడం జరిగిందని తెలిపారు. రిలీఫ్ కిట్లో బియ్యం, పప్పు, నూనె, సబ్బులు, పప్పులు, ఉప్పు, పసుపు తదితర నిత్యావసర సరుకులు, బ్లాంకెట్లు,




దుప్పట్లు ఈ రిలీఫ్ కిట్ లో ఉన్నాయి. అదేవిధంగా ఈ నెల 9వ తేదీ మంగళవారం నాడు ఎల్లారెడ్డిలో వరద బాధిత కుటుంబాలకు 150 కిట్లను, బాన్సువాడలో 150 కిట్లను ఇన్ఫోసిస్ మరియు రామకృష్ణ మట్ సహకారంతో అందించడం జరుగుతుందని అన్నారు. ఆపద సమయంలో ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకుంటున్నందుకు రామకృష్ణ మట్ మరియు ఇన్ఫోసిస్ సంస్థకు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞత తెలుపుతున్నట్టు తెలిపారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి వరద భాదితులను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డిఓ వీణ, తహసీల్దార్ జనార్దన్, రామకృష్ణ మట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఎస్ పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రజావాణిలో 10 ఫిర్యాదులు



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా: సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి 10 మంది ఫిర్యాదు దారులు ఎస్ పి కార్యాలయం కు వచ్చారు. ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబందించిన పోలీస్ స్టేషన్లో వెంటనే పరిష్కరించే విదంగా సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశించారు.భూతగాదాలు-5కుటుంబ గొడవలు బి01ఇరువర్గాల మధ్య గొడవలు-2ఇతర ఫిర్యాదులు -2

# ఓపెన్ స్కూల్ ప్రవేశానికి 12 వరకు దరఖాస్తులు చేసుకోవాలి

## కోఆర్డినేటర్ కంచర్ల శివప్రసాద్



తెలంగాణలోకల్ గైడ్ : సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్స్ మరియు కళాశాల లో చేరేందుకు ఈనెల 12 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోఆర్డినేటర్ కంచర్ల శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పెంచిన గడువు ప్రకారం 12 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మీసేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని 13 నుండి 20వ తేదీ వరకు అపరాధ రుసుముతో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు

# ఈ నెల 10న తుది ఓటరు జాబితా,

## ఎంపీటీసీ, జడ్పీటిసిల ఎన్నికల షెడ్యూల్లో భాగంగా సెప్టెంబర్ 10వ తేదీన ఓటర్ల తుది జాబితా జిల్లా కలెక్టర్,



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా:స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నాగర్ కర్నూలు జిల్లాలోని ఎంపీటీసీలు, జడ్పీటిసిల వారిగా 1224 పోలింగ్ కేంద్రాల్లో ఫోటోలతో కూడిన ఓటర్ జాబితాను సిద్ధం చేసి ఎంపిటిసిల పోలింగ్ కేంద్రాల వారిగా సోమవారం ప్రచురించడం జరిగిందని, ఎంపీటీసీలు, జడ్పీటిసిల పోలింగ్



కేంద్రాల వారిగా ఓటర్ల జాబితా తయారీతో పాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం తో కలిసి ఎంపీటీసీల, జడ్పీటిసిల ఎన్నికల ఓటర్ జాబితా షెడ్యూల్ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...... రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 6వ తేదీన విడుదల చేసిన షెడ్యూల్ ను కలెక్టర్ వివరిస్తూ ఈనెల 8న జిల్లా స్థాయి, మరియు మండల స్థాయి లో రాజకీయ పార్టీ నేతలతో భేటీ మండల స్థాయి రాజకీయ పార్టీ నేతలతో ల భేటీ, ఈనెల 8 నుంచి 9 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 10న తుది ఓటర్ జాబితా విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనే కాకుండా అంతకు ముందుగా కూడా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు తీసుకొని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుగ్గా ఉండి వారి దృష్టికి వచ్చిన ఎంపీటీసీలు, జడ్పీటిసిల ఎన్నికల అంశాలు ఏమైనా ఉంటే వాటిని సమావేశంలో తెలియజేయాలన్నారు.ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిదిద్దడం వలన స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారవుతుందని తద్వారా రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా పై విశ్వాసం కలుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో హడావుడి చేయకుండా ముందుగానే ఓటర్ల జాబితా అభ్యంతరాలను నేటి నుంచి 9వ తేదీ వరకు అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలన్నారు. ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో రాష్ట్ర వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని ప్రతి ఓటర్ తన ఓటు హక్కును జాబితాలో ఉందో లేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ఎన్నికల సంఘం కల్పించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లాలో 460 గ్రామపంచాయతీలు,214 ఎంపీటీసీ స్థానాలు, 20 జడ్పిటిసి స్థానాలు, 1224 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రకారం 6,47,342 ఓటర్లు ఉన్నారని, అందులో 3,23,015 మంది పురుషులు, 3,24316 మంది మహిళా ఓటర్లు, 11 మంది ఇతరులు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన జడ్పిటిసి ఎంపిటిసిల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల అభ్యంతరాల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 10వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేయనున్నట్లు కలెక్టర్ సందర్భంగా తెలిపారు.ఈ సమావేశంలో వివిధ గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఏబీవీపీ నాగర్ కర్నూల్ నగర నూతన కార్యవర్గం ఎన్నిక

## నగర అధ్యక్షులుగా ప్రదీప్ కుమార్, కార్యదర్శిగా ప్రసాద్ కుమార్

నాగర్ కర్నూల్ జిల్లా**లోకల్ గైడ్** :అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ నగర నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ శివశంకర్ గౌడ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు ముఖ్య అతిథిలుగా పాల్గొని నూతన నగర కార్యవర్గాన్ని ప్రకటించారు.

**నగర కార్యవర్గం:**

నగర అధ్యక్షులుగా డా. ప్రదీప్ కుమార్, కార్యదర్శి గా ఎస్. ప్రసాద్ కుమార్,నగర సంయుక్త కార్యదర్శిలు గా ఎ.శివకుమార్,ఎం.శివకుమార్, మల్లేష్ యాదవ్, నగర ఉపాధ్యక్షులుగా జి.మార్కండేయ లతో పాటు కార్యవర్గ సభ్యులుగా









మధు,శ్రీరామ్, వికాస్,జ్ఞానేందర్, రమేష్,రాకేష్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ శివశంకర్ గౌడ్ గారు మాట్లాడుతూ విద్యార్థి సంక్షేమం కోసం నిరంతరం సేవ చేసే,సమాజ మార్పుకు తోడ్పడే నాయకత్వాన్ని ఏబీవీపీ తయారు చేస్తుందని అన్నారు.నాగర్ కర్నూల్ శాఖ నుంచి వస్తున్న ఈ నూతన నాయకత్వ బృందం విద్యార్థి హక్కుల కోసం పోరాడుతుందనే నమ్మకం ఉందని అన్నారు.నూతన కార్యదర్శిగా ఎన్నికైన ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా శాఖ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తూ,విద్యార్థుల్లో జాతీయత భావన బలపడేలా కృషి చేస్తానని చెప్పారు. క్రమశిక్షణ, సేవా దృక్పథంతో విద్యార్థుల సేవలో నిరంతరం పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివశంకర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు, జిల్లా కేలో భారత్ కన్వీనర్ రమేష్ ,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొనారు.

# సోమవారం ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,



నాగర్ కర్నూల్ జిల్లా**లోకల్ గైడ్** :జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా కేంద్రంలోని నాగర్‌కర్నూల్ పట్టణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. వారి సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను అధికారికంగా తెరిచి గోడౌన్‌లో భద్రపరిచిన ఎన్నికల సామాగ్రి పరిస్థితిని పరిశీలించారు.కలెక్టర్ మొదటగా గోడౌన్‌లో ఉంచిన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మరియు ఇతర ఎన్నికల పరికరాలను గదుల వారీగా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరికరాల భద్రతను నిర్ధారించేందుకు అక్కడ అమర్చిన సీసీ కెమెరాల పనితీరును ఒకదానికొకటి తనిఖీ చేశారు. గోడౌన్‌లో భద్రతా సిబ్బందిని క్రమం తప్పకుండా నియమించడం, రౌండ్-ది-క్లాక్ పహారా ఏర్పాటు చేయడం వంటి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎన్నికల సామాగ్రి రవాణా, నిల్వ, భద్రత వంటి ప్రతి అంశంపై అధికారులు పూర్తి శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గోడౌన్ చుట్టుపక్కల సీసీటీవీ పర్యవేక్షణను పెంచడం, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సకాలంలో పరికరాల మెయింటెనెన్స్ చేపట్టాలని సూచించారు. ఈవీఎంల భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవికుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిజెపి నాగేంద్ర గౌడ్ బిఆర్ఎస్ వెంకటయ్య వైఎస్ఆర్సిపి హుస్సేన్ బీఎస్పీ రామకృష్ణ సిపిఐ శివ శంకర్ టిడిపి బాలకృష్ణ తదితరులుసిబ్బంది తదితరులు ఉన్నారు.

# పఠాన్ చేరు లో అంగరంగ వైభవంగా గురుపూజోత్సవం

-వంద మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి): పఠాన్ చేరు నియోజకవర్గంలోని పఠాన్ చేరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం అంగరంగ వైభవంగా గురుపూజోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని పఠాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ పంకజ్ మాట్లాడుతూ..25 ఏళ్లుగా నిరంతరాయంగా గురు పూజోత్సవం నిర్వహిస్తూ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులను మంచి



పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందని అన్నారు. సమాజంలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం, సైబర్ క్రైమ్‌లుపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతు..తాను ఎంపీపీగా ఉన్నప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం గురు పూజోత్సవం నిర్వహించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో గురువుల పాత్ర గణనీయమన్నారు.పఠాన్ చేరు ఎద్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దు చూన్నామని ప్రకటించారు.అనంతరం నియోజకవర్గం లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వంద మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు

## ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



కొత్తగూడెం (లోకల్ గైడ్ ): తెలంగాణ రాష్ట్ర ఫోటో గ్రాఫర్ ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 20, 21, వ తేదీలలో హైదరాబాద్ లో జరగబోయే ఫోటో ట్రేడ్ ఎక్స్పో - 2025 పోస్టర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ తో పాటు ఫోటో గ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఫోటోగ్రఫీ రంగం ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా అభివృద్ధి చెందుతోందని, యువత ఈ రంగంలో మంచి అవకాశాలను పొందగలరని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఐ టూల్స్ వలన ఫోటో గ్రఫీ రంగంలో కూడా మార్పులు వచ్చాయని దీనికి అనుగుణంగా ఫోటో గ్రాఫర్ లు మెలుకువలు నేర్చుకోవాలని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ నుంచి డ్రోన్ టెక్నలిజీ పై నేర్చుకోవాలని ఎవరికైనా ఉత్సాహం ఉంటే ప్రభుత్వం తరపున ట్రైనింగ్ ఇప్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అదే విధంగా ఫోటో గ్రాఫర్ లకు అవసరమైన వర్కషాప్లు నిర్వహించాలను కుంటే ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల అధ్యక్షులు జిల్లపెల్లి నాగరాజు, కొత్తగూడెం ప్రధాన కార్యదర్శి తెలంగాణ శంకర్, కోశాధికారి గాయత్రి ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్ వలీ, నామా నరేష్, హరి నారాయణ , రవికుమార్, కార్తీక్, స్థానిక ఫోటో గ్రాఫర్ లు పాల్గొన్నారు.

## హఫీజ్ పేట్ డివిజన్ సమస్యల మయం

### -బీజేపీ నేత బోయిని మహేష్ యాదవ్



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హఫీజ్ పేట్ డివిజన్‌లో పలు సమస్యలపై బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కాలనీవాసులు కలిసి




చందానగర్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ..డివిజన్ మొత్తం సమస్యల మయమైందని, శానిటేషన్ దయనీయంగా ఉందని, రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైన స్మశానవాటిక పనులు ఇంకా పూర్తికాక పోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వర్షాకాలంలో అనేక ప్రాంతాలు నీటి మయమవుతున్నాయని, బతుకమ్మ నిమజ్జనానికి మదీనాగూడ పరిధిలో ప్రత్యేక కొలను లేకపోవడం మహిళలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. అధికారులు సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పవన్, సురేష్ కురుమ, శివ ముదిరాజ్, దేవేందర్ దాస్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రెస్క్యూ జి యం శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రెస్క్యూ ప్రతినిధులు




గోదావరి ఖని, 08 సెప్టెంబర్ లోకల్ గైడ్ : సింగరేణి సంస్థలో పనిచేస్తూ అత్యవసరం సమయంలో సంస్థ యొక్క ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలగకుండ కాపాడే సైనికులు రెస్క్యూ ఉద్యోగులు అని అలాంటి వారిని సింగరేణి యాక్టివ్ రెస్క్యూ ట్రెండ్ పర్సన్ గా తన సర్వీస్ కాలానికి గాను ఉద్యోగ విరమణ పొందే ముందు జోనల్ రెస్క్యూ కాంపిటేషన్ జరిగే సమయంలో వీరిని ప్రత్యేకంగా గుర్తించి సన్మానించి షీల్డ్ ను అందజేయాలని తెలియపరుస్తూ ఈరోజు రెస్క్యూ స్టేషన్ లో రెస్క్యూ జిఎం శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా ఈ యొక్క కార్యక్రమాన్ని చేపడతామని అది కూడా రేపు జరగబోయే జోనల్ రెస్క్యూ కాంపిటీషన్ ప్రోగ్రాం లో జరిపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి రెస్క్యూ సూపర్నెంటెడ్, తిరుపతి నరసింహ మూర్తి ఇన్స్ట్రక్టర్స్ సింగరేణి ఆక్టివ్ రెస్క్యూ ట్రెండ్ పర్సన్స్ చల్లా రవీందర్ రెడ్డి, కట్ల కైలాష్, గూడెల్లి అశోక్, రాకం రాజన్న, మల్లారెడ్డి, నవాబ్, కళాధర్, సంజీవ్ తో పాటు రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు

## జెడ్పిటీసి, ఎంపీటీసి స్థానాలకు ఈ నెల 10న ఓటర్ తుది జాబితా విడుదల



రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్):రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఈ నెల తుది ఓటరు జాబితాను వెలువరించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీ.ఈ.ఓ రంగరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ఎన్. మహేష్, ఆవుల యాదయ్య, కె.రాజ్ కుమార్, బిఆర్ఎస్ నుండి వనం శ్రీనివాస్, బిజెపి నుండి కె.అనంతయ్య గౌడ్, అంబాజీ శ్రీనివాస్,సిపిఐ(యం) నుంచి పగడాల యాదయ్య, సిపిఐ నుండి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, టిడిపి నుండి జె. రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు మార్గదర్శకులు గురువులే

### - జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్.



గద్వాల, లోకల్ గైడ్ :విద్యార్థులకు మార్గదర్శకులు గురువులేనని, సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షనల్ హాల్‌లో ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో దేశ అభివృద్ధి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ



దినోత్సవం నిర్వహించడానికి ముఖ్య ఉద్దేశం ఉపాధ్యాయుల అంకితభావం, శ్రమను గుర్తించి వారిని గౌరవించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ తన విద్యాభ్యాసాన్ని గుర్తుచేసుకుంటూ, ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ,విలువలే తన విజయానికి పునాది కాగా,అవే ఐఏఎస్ స్థాయికి తీసుకువచ్చాయని, ఆ విలువలను ఇప్పటికీ ప్రతిరోజూ తన జీవితంలో పాటిస్తున్నానని అన్నారు. జిల్లాలో పదవ తరగతి%-%2025 ఫలితాల్లో రాష్ట్రంలో 32వ స్థానం నుండి 26వ స్థానానికి చేరి 10.36% వృద్ధి సాధించిందని,ఈ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, మరింత నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యూట్యూబ్ తదితర వనరుల ద్వారా సులభంగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు. ప్రతి టీచర్ 10 మంది విద్యార్థులను అడాప్ట్ చేసుకొని మోటివేట్ చేసి వాళ్ళను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి వారం రెండు పాఠశాలలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. పాఠాలను సరిగ్గా అర్థం చేసుకోలేని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, మంచి ఫలితాలు సాధించాలన్నారు. గద్వాల ప్రాంతంలో ఎంతోమంది విద్యార్థులు ఉన్నతమైన విద్యతో పాటు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. గద్వాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సమాజంలో అత్యున్నత స్థానాలను సాధిస్తూ, గొప్ప ప్రేరణగా నిలిచారని ,ఎస్బీఐ చైర్మన్ ఆ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. విద్యా ప్రగతికి ఉపాధ్యాయుల సూచనలను స్వీకరించి, వాటిని కార్యరూపంలోకి తీసుకొస్తామని తెలిపారు. టీచర్ ప్రవర్తనను బట్టి పిల్లల ప్రవర్తన ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఉన్నతంగా ఉంటూ పిల్లలకి చదువుతో పాటు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని అన్నారు. మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని సూచించారు. గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల కృషి వల్ల విద్యార్థులు మెరుగైన విద్యతో పాటు క్రమశిక్షణలో అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. భారతదేశానికి రాష్ట్రపతి అయిన వారు తమ గురువుల సూచనలు పాటిస్తూ ఉన్నతస్థాయి సాధించారని, ఇది ఉపాధ్యాయుల పాత్రను ప్రదర్శిస్తుందని చెప్పారు. ప్రపంచ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల జీవితాల్లో వారు బోధించే ప్రతి విద్య విలువ అత్యంత ముఖ్యమని అన్నారు. గద్వాల ప్రాంతం ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా ఉందేదని, ఉపాధ్యాయుల కృషి వల్ల అక్షరాస్యత,విద్యా ప్రమాణాల్లో ఉన్నత స్థాయి సాధించబడిందని గుర్తు చేశారు. గట్టు మండలం భారతదేశంలో వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటి అయితే, ఈరోజు అక్షరాస్యత మెరుగుపడుతూ ముందుకు వెళ్తుందని తెలిపారు. మట్టిలో మాణిక్యం ఉన్నట్టే, గ్రామీణ ప్రాంతంలోని ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసి ఉత్తమ స్థాయికి తీసుకువచ్చారని అన్నారు. ప్రతి రంగానికి ఒక గురువు ఉంటారని అన్ని రంగాల్లో ఉన్నతంగా అభివృద్ధి చెందడానికి గురువుల తోడ్పాటు అవసరమని అన్నారు. గురువులు సమాజానికి అవసరమయ్యే భావిభారత పౌరులను తీర్చిదిద్దే విద్యా వ్యవస్థను




పటిష్టం చేసేందుకు కృషి చేయాలన్నారు. గద్వాల్ జిల్లాలో 55 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడానికి కృషి చేసిన 10 పాఠశాలల ఉపాధ్యాయులకు కలెక్టర్, గద్వాల శాసనసభ్యులు వారికి ప్రశంస పత్రం, మేమెంటో, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వయోజనవిద్యా శాఖ మార్గదర్శిని పుస్తకం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని, మండల విద్యాశాఖ అధికారులు , ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల పింఛను రూ 6000 పెంచాలి

**వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు నేత గీత బీడీ కార్మికులతో పాటు,ఇతర పెన్షన్ దారులకు రూ 4000 పెన్షన్ పెంచాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పెన్షన్ దారులకు నూతన పెన్షన్ మంజూరు చేయాలి.**







నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ( లోకల్ గైడ్) .వికలాంగుల పింఛన్ 6 వేలకు పెంచాలని, వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు నేత గీత బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారులకు 4000 పెన్షన్ పెంచాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పెన్షన్ దారులకు నూతన పెన్షన్ మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్ రూ 4000 నుండి రూ 6000/- పెంచుతామని, వృద్ధులు వితంతువులతో పాటు ఇతర పెన్షన్ దారుల పెన్షన్లు రూ 2000/- నుండి రూ 4000/- పెంచుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా వాగ్దానం చేశారు. కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవీ చేపట్టి 22 నెలలు గడిచినా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచలేదు అని విమర్శించారు .ఇది ఘోరమైన మోసం. ప్రస్తుత పెన్షన్ ఏ విధంగానూ సరిపోవడం లేదు. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అన్నారు . నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుత పెన్షన్ వల్ల నెల రోజుల పాటుపౌష్టికాహారం తీసుకునే పరిస్థితి కూడా లేదు. కుటుంబ సభ్యుల చేతనే ఎన్నో అవమానాలు ,అవహేళనలు ఎదుర్కొంటున్న వికలాంగులు వృద్ధులు వితంతువులు ఇతర పెన్షన్ దారుల యొక్క దీన పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరుతున్నాం అన్నారు .కనీసం సరియైన తిండి తినడానికి కూడా సరిపోని పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేదని గుర్తు చేస్తున్నాం అన్నారు. ఇప్పటికే చేయూత పెన్షన్లు పెంచాలని " పద్మశ్రీ " మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో చేయూత పెన్షన్ దారులు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. అయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు అన్నారు .కనుక ఇకనైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి వికలాంగుల పెన్షన్ రూ 6000/- అలాగే వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు నేత గీత బీడీ కార్మికులతో పాటు ఇతర చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ 4000/- పెంచాలని , పూర్తి కండరాల క్షీణత కలిగిన వారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వలె నెలకు రూ 15000/- పింఛను ఇవ్వాలని అలాగే అర్హులైన వారికి నూతన పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి రాష్ట్ర సమన్వయకర్త జానకి రామయ్య చౌదరి , ఎం జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాదె రమేష్ మాదిగ , ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ , ఎం ఆర్ పి ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ , విహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీనివాస్ , విహెచ్పిఎస్ రాష్ట్ర నాయకురాలు రెడ్డి మాస్ ఇందిరాచౌదరి , విహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు ఎండి హైమద్ ఖాన్ , విహెచ్పిఎస్ జిల్లా నాయకులు చిలుముల జలంధర్ ,ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి నాయకులు తరి ఏడుకొండలు మాదిగ మేడి శంకర్ మాదిగ పోలేని యాదయ్య మాదిగ మడుపు శ్రీనివాస్ మాదిగ ఎర్ర సాని గోపాల్ మాదిగ బొజ్జ చిన్న మాదిగ వంగూరి ప్రసాద్ మాదిగ మాసారం వెంకన్న మాదిగ శ్రీను,కావలి కృష్ణ మాదిగ,నల్ల శ్రీకాంత్ మాదిగ విహెచ్పిఎస్ ,సి పి హెచ్ పి ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## చిన్నారి వైద్యానికి చేయూత

### మరోసారి మానవత్వం చాటుకున్న పొంగులేటి క్యాంప్ శ్రేణులు



కొత్తగూడెం(లోకల్ గైడ్ తెలంగాణ): తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడుతు కొత్తగూడెంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ శ్రేణులు, ఛత్రపతి శివాజీ మహారాజ్ సేన స్పందించారు. భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ మండలం నాగారం కాలనీ చెందిన కేసోజు కృష్ణమాచారి రేవతి దంపతుల కుమార్తె జ్ఞాన్విక తీవ్ర అనారోగ్యం పాలై శ్వాసకి సంబంధించిన ఇబ్బంది ఎదురవడటంతో చిన్నారి చికిత్సకు రోజుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందన్న విషయం పాల్వంచ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభిమానులు యూత్ కాంగ్రెస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన చీకటి కార్తీక్ ఛత్రపతి శివాజీ మహారాజ్ సేన అధ్యక్షులు జోగు ప్రదీప్ మరికొందరు కలిసి తక్షణ సహాయంగా 30వేలు అందించి, త్వరలోనే వీలైనంత ఎక్కువ ఆర్థికసాయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కసనబోయిన రామ్మూర్తి, నరేందర్, నాగారం ఉపసర్పంచ్ ప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజయ్ సిటీ లంబోదరుడి లడ్డూకి రూ.2 లక్షల 3 వేలు భారీ ధర



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): మియాపూర్ ప్రజయ్ సిటీలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. 11 రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న లంబోదరుడి లడ్డూ వేలంలో భక్తులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. ఈ వేలంలో ప్రజయ్ సిటీ 5వ బ్లాక్‌కు చెందిన సునీల్, సాఫ్ట్వేర్ సురేష్‌లు రూ.2 లక్షల 3 వేల రూపాయలకు వినాయకుడి పెద్ద లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం జెనరల్ సెక్రటరీ రామకృష్ణ, కమిటీ సభ్యులు లడ్డూను సునీల్, సురేష్‌లకు అందజేశారు. గణపతి ఆశీస్సులు వారి కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గణనాథుడి ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శివనాగమణి నాయుడు, అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ నాయుడు, జనరల్ సెక్రటరీ సుబ్బారావు, కాలనీ పెద్దలు రత్నం, కమ్యూనిటీ సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



కామారెడ్డి ,లోకల్ గైడ్ : ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 73 అర్జీలు అందాయి. జిల్లాలోని వివిధ



ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి వివిధ సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నేత్రదానానికి టీఎస్ఆర్టీసీ తోడ్పాటు

-బస్సులో ఉచితంగా కార్డియాల రావాణ
-సరోజినీ దేవి కంటి ఆసుపత్రితో ఒప్పందం
-ఆర్టీసీ..ఎండీ విసి సజ్జనార్



హైదరాబాద్, (లోకల్ గైడ్ ప్రతినిధి): సామాజిక బాధ్యతలో భాగంగా నేత్రదానానికి టీఎస్ ఆర్టీసీ తోడ్పాటు అందిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో సేకరించిన నేత్రాల కార్నియాలను ఉచితంగా తమ బస్సులలో హైదరాబాద్‌కు తరలించేందు కు టీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు నెట్‌వర్క్ టు సైట్ పేరుతో సరోజిని దేవి కంటి ఆసుపత్రితో ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఎండీ విసి సజ్జనార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ నేత్రదాన ప్రతిజ్ఞ చేశారు.ప్రతి ఏటా దేశంలో 3 లక్షల మందికి పైగా నేత్రాల కోసం ఎదురుచూస్తుండగా కేవలం 18 వేల మార్పిడులే జరుగుతున్నాయని గుర్తుచేసారు, మరణాంతరం ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ తో పాటు డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా వానిలో వచ్చిన ఫిర్యాదులను దశల వారిగా పరిష్కరిస్తాం- కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్ ): ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి వాటిని దశాల వారిగా పరిష్కరించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వివిధ రకాల (64) ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీపెట్టుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూపరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ంవెన్యూ శాఖ 42, ఇతర శాఖలు 22, మొత్తం 64 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితికి పోచంపల్లి రాజీనామా...



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.( లోకల్ గైడ్).తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు పోచంపల్లి రమణారావు వెల్లడించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొన్ని ఆని వార్య కారణాల వల్ల తాను ఆ పదవిలో ఉండలేకపోతున్నాననీ వేలుబుచ్చారు. గత 15 ,16 సంవత్సరాల నుండి తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ లో గంగు బాను మూర్తి శిష్యరికల్లో 10 సంవత్సరాల పైన పనిచేసిన అనుభవం, అలాగే సోదర సమానులైన గంగు ఉపేంద్ర శర్మ తో 5 సంవత్సరాల అనుబంధం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో తిరిగి బ్రాహ్మణుల అందరిని ఒక తాటిపై తీసుకురావటం కోసం అహర్నిశం కష్టపడ్డానని తనకు సహకారం అందించిన బాబాయి గంగు బాను మూర్తి కి. సోదరులు గంగు ఉపేంద్ర శర్మ కి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని ఇన్ని సంవత్సరాల అనుబంధం పెంచుకున్న నేను ఇప్పుడు వెళ్ళిపోతుంటే బాధగా ఉంది తప్పని పరిస్థితుల్లో నా వీధి నిర్వహణ నుండి తప్పు కుంటున్నానని బాధ తత్వ హృదయంతో తెలియజేశారు. నేను ఎక్కడున్నా పెద్దల ఆశీస్సులు నిరంతరం నాపై ఉంటాయని ఉండాలని కోరుకుంటూ నా రాజీ నామాను స్వీకరించి ఈ రోజు నుండి ఆ పదవిలో పెద్దలు పూజ్యులు ఉపేంద్ర శర్మ అన్న వేరొకరికి బాధ్యతలు అప్పగించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజావాణిలో దరఖాస్తులు



లోకల్ గైడ్ లక్షెట్టిపేట:లక్షెట్టిపేట 8 సెప్టెంబర్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో కొత్తూరు గ్రామంలో నుండి ఇందిరమ్మ ఇళ్ల కోసం 12 అప్లికేషన్లు వచ్చినట్టు స్థానిక తహసిల్దార్ దిలీప్ కుమార్ తెలిపారు. మరియు మఠ్రిపల్లి గ్రామానికి చెందిన అతె సంధ్య అనే మహిళ తన భర్త కిడ్నీ పాడవడంతో తన కిడ్నీని ఇచ్చానని కావున తనకు ఏదో ఒక పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని కోరినట్లు ఈ సందర్భంగా తాసిల్దార్ దిలీప్ కుమార్ వివరించారు. వెంటనే అధికారులను పంపి సర్వే చేసి దరఖాస్తుదారుల సమస్య తీరేలా కృషి చేస్తానని అన్నారు.

## మామ్నూర్ పోలీస్ శిక్షణ కళాశాల లో సంస్కృతిక కార్యక్రమాల పోటీలు

**పదవ బెటాలియన్ వరంగల్ గ్రూప్ తెలంగాణ ఆధ్వర్యంలో**

**ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ జాతీయ సమైక్యత 12 రోజుల క్యాంపులో భాగంగా**



హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్):మామ్నూర్ పోలీస్ శిక్షణ కళాశాల పదవ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో కల్నల్ సచిన్ అన్నారావు నెంబర్కర్ వీర్ చక్ర కమాండెంట్ గా కొనసాగుతున్న ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ జాతీయ సమైక్యత క్యాంప్ 12 రోజుల క్యాంపులో ఏడవ రోజు బీహార్ జార?ండ్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ డైరెక్టర్ల మధ్య సంస్కృతిక కార్యక్రమాల పోటీలు జరిగాయి ఇందులో గ్రూప్ డాన్సులు, గ్రూప్ సాంగ్స్, వివిధ రాష్ట్రాల యొక్క వంటకాలు పోటీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఎస్ రామదురై తెలిపారు. భాషలు వేరైనా భావాలు వేరైనా సరిహద్దులు దూరమైన సమైక్య స్ఫూర్తి కలబోసుకుని భారత ఐక్యత రాగాన్ని రంగు రంగుల డాన్సులతో పిటిసి ఆడిటోరియం 600 మంది ఎన్సీసీ కాడేట్స్ వారి సంస్కృతిక విన్యాసాలు అందరినీ అబ్రపరిచాయి అన్నారు. ఒకరి సంస్కృతి ఒకరు గౌరవిస్తూ చప్పట్లతో మారి మోగిపోయింది ఆడిటోరియం అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు నిమ్బాల్కర్ వీర్ చక్ర హాజరయ్యారు, వరంగల్ గ్రూప్ శిక్షణ అధికారి ప్రత్యేక వివిధ రాష్ట్రాల జడ్జిలను న్యాయ నిర్ణేతలుగా ఎంపిక చేసి పోటీలు నిర్వహించారు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో గ్రూప్ సాంగ్స్ గ్రూప్ డాన్సులు బీహార్ జార?ండ్ వాళ్లను ఎంతో ఆకర్షించాయి అని అన్నారు. బీహార్ జార?ండ్ వాళ్ళ యొక్క గ్రూప్ డాన్సులు గ్రూప్ సాంగ్స్ తెలంగాణ వాళ్లు స్టెప్పులు వేయడం జరిగిందని సంతోషించారు. సాయి సైబర్ క్రైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ప్రత్యేక నిపుణులచే శిక్షణ ఇవ్వడం జరిగిందని, క్యాంపు డిప్యూటీ కమాండెంట్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. ఈ క్యాంపులో శిక్షణ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే. క్యాంప్ అజ్జుడెంట్ కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, ఫస్ట్ ఆఫీసర్ దూడల వెంకటేష్ గౌడ్, జయరాం సింగ్ ,సౌరస్య, కదం, సంతోష్ పవర్, సుతార్, సందీప్ , ఫస్ట్ ఆఫీసర్ టి గణేష్, రవి, అంజి ,కమల్ కిషోర్ ,కల్పన, రచన, సరిత, సంతోషి ,దీపక్ ,అరుణ, కుమారస్వామి, మహేష్, సతీష్, దత్తు, ప్రవీణ్, నిఖిలేష్ పాల్గొన్నారు



# ఏఎన్ఎం ల మొబైల్ అప్లికేషన్ లలో ఆన్లైన్ వర్క్ ల వల్ల కలిగే పని ఒత్తిడిని తగ్గించాలి

**నల్లగొండ కలెక్టరేట్ ముందు ఏఎన్ఎం ల ధర్నా .**

**ఏఐటీయుసీ కార్యదర్శి డిమాండ్. పల్లా దేవేందర్ రెడ్డి.**

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. (లోకల్ గైడ్) . నేషనల్ హెల్త్ మిషన్ నందు ఏఎన్ఎం లుగా పనిచేస్తున్న వారికి ఆన్లైన్ యాప్ల వల్ల తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తక్షణమే వాటిని రద్దు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి కి మెమోరాండం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవటానికి, అంటువ్యాధులు ప్రబలకుండా కావలసిన జాగ్రత్తలు తీసుకోవడానికి, ఆరోగ్యం మెరుగు పడటానికి కావలసిన ముందస్తు జాగ్రత్తలతో పాటు అవగాహన కల్పించడానికి, చిన్నపిల్లలకు టీకాలు వేయడానికి ఏఎన్ఎం లుగా ఉద్యోగంలోకి తీసుకున్నారనీ. మారుతున్న పరిస్థితుల రిత్యా గత కొంతకాలంగా ఏఎన్ఎం లు చేసిన పనులకు సంబంధించిన కొన్ని రిపోర్టులను ఆన్లైన్ ద్వారా పంపించాలని 2016వ సంవత్సరంలో తెలియజేశారు. ఒకటి రెండు యాపులతో ప్రారంభమైన ఆన్లైన్ పనులు ప్రస్తుతం దాదాపు 14 మొబైల్ అప్లికేషన్స్ లను పూర్తి చేయాల్సి వస్తుంది. ఇందులో ముఖ్యమైన యాప్ లు యు - విన్, ఎన్ సి డి, ఎమ్ సి హెచ్, -కే ఐ టి, ఐ డి ఎస్ పి , టీబీ, ఎం యు కే టి హెచ్ భారత్ , సికెల్ సెల్ లాంటి మొబైల్ అప్లికేషన్ లలో మరలా 20 నుండి 30 కాలమ్స్ ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా యు - విన్ యాప్ అప్లోడ్ కి సంబంధించి రాత్రి 11 గంటల నుండి 1గం ల మధ్యలోనే పనిచేస్తుంది.అంటే రాత్రి అంతా మేల్కొని పనిచేయాల్సి వస్తుంది. ఇక ఎన్ సి డి విషయానికొస్తే ప్రతి వ్యక్తిని స్క్రీనింగ్ చేయడంతో పాటు ఆ వ్యక్తికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఆన్లైన్ చేయవలసి వస్తుంది. అంటే దాదాపు ఒక వ్యక్తికి సంబంధించి అర్ధగంట సమయం కేటాయించవలసి వస్తుందనీ అన్నారు. మొత్తం పాపులేషన్ లో 35% మందికి ఈ ఎన్సీడీ చేయాలని ఏఎన్ఎం లకు టార్గెట్ విధించారు. ఒకవైపు ఆఫ్లైన్ మరొకవైపు ఆన్లైన్ వర్కులు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ అన్నారు. ముఖ్యంగా హై బీపీ %ల% లో బిపి, షుగర్, స్పాంట్లైటిస్, లతోపాటు కంటి చూపు కోల్పోవడం వంటి శారీరిక ఇబ్బందులతో పాటు అనేక మానసిక రుగ్మతలకు కూడా గురవుతున్నారు. వాస్తవానికి ఏఎన్ఎం లు కేవలం ప్రజల యోగక్షేమాలతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను చూసే నర్స్ మాత్రమే. కానీ యాప్ లతో ఏఎన్ఎం లను కంప్యూటర్ ఆపరేటర్లుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా మార్చి వేశారనీ దేవేందర్ రెడ్డి ఆరోపించారు.. ఒకవైపు ఉద్యోగంలో చేరినప్పుడు ఇచ్చిన బాధ్యతలతో పాటు అదనంగా మరికొన్ని బాధ్యతలు ఇవ్వడం కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారూ. ఆన్లైన్ విధానం వచ్చినప్పుడు ఇక ఆఫ్లైన్ ఉండదు అని చెప్పారు.. కానీ ఇప్పుడు ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ రెండు చేయిస్తున్నారు. ఆన్లైన్ చేశాం కదా అని రికార్డులు రాయకపోతే తనిఖీల పేరుతో సబ్ సెంటర్లకు వచిన అధికారులు మెమోలు ఇస్తామని, సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారనీ అన్నారు. ఆన్లైన్ వర్బ్ నుండి ఏఎన్ఎం లందరికీ మినహాయింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేవస్ రెడ్డి6 డివిజన్ కార్యదర్శి విశ్వనాధులు లెనిన్, ఏఎన్ఏం14 ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ గీతారాణి కోశాధికారి ఎస్ పద్మ , సరిత భవాని శారద ఎస్ రేణుక నాగమణి సిహెచ్ సరిత హైమావతి బి హరిత ఏం నిర్మల శిల్ప మాధురి అనిత సునీత జ్యోతి జీ సులోచన ఎస్ పద్మ రుక్సానా అన్నమ్మ వై శోభారాణి విజయలక్ష్మి జీవిత నాగలక్ష్మి నిర్మల కౌసల్య ఉమారాణి స్వాతి సాలమ్మ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు







## టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం



లక్షెట్టిపేట లోకల్ గైడ్.లక్షెట్టిపేట, సెప్టెంబర్ 08 :మండలం లోని గుల్లకోట గ్రామంలో సోమవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించినట్లు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఈ వైద్య శిభిరం లో 130 మందికి స్క్రీనింగ్ చేశామని అందులోనుండి 50 మందిని లక్షెట్టిపేట సివిల్ ఆసుపత్రికి 102 వాహనాల్లో తీసుకెళ్ళి ఎక్స్ రే, మరో 40 మందికి తెమడ పరీక్షలు అలాగే 40 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేశామన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం మంచిర్యాల జిల్లాలో జిల్లా వ్యాప్తంగా ఒక షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం క్షయ వ్యాధిపై ప్రజలకు ఉన్న అపోహాలపై ఈ వైద్య శిభిరం లో అవగాహన కల్పించినట్లు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం లో టీబీ సూపర్ వైజర్ సురేష్ ,వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ మార్త , ఎంఎల్ హెచ్ పి నవ్య , హెల్త్ అసిస్టెంట్లు వేణు , గఫూర్, ఇసాక్ అహ్మద్ , ఏఎన్ఎం ఇందు ప్రియ మరియు ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

## శాంతియుతంగా ముగిసిన నిర్మల్ పట్టణం వినాయక నిమజ్జనం



నిర్మల్ : లోకల్ గైడ్ :నిర్మల్ పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య శాంతియుతంగా ముగిశాయి. నిన్న రాత్రి వరకు సాగిన వినాయక నిమజ్జన కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. నిమజ్జనం ఉత్సవాల ముగిసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిమజ్జన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తుగా తీసుకున్న చర్యల వలన ఎక్కడా లోటుపాట్లు లేకుండా కార్యక్రమం పూర్తయింది తెలిపారు. నిమజ్జన ఘాట్ల వద్ద భద్రతా చర్యలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, అగ్నిమాపక, ఆరోగ్య, ట్రాన్స్‌పోర్ట్ వంటి విభాగాలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, గణేష్ ఉత్సవ కమిటీలు సమిష్టిగా పనిచేయడం వల్లే ఈ సాంప్రదాయ కార్యక్రమం విజయవంతమైందని కలెక్టర్ అభినందించారు. వినాయక సాగర్‌లో నిమజ్జనానంతరం పారిశుద్ధ్య చర్యలను వేగంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, పోలీసు సిబ్బంది, గణేష్ కమిటీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.



## తక్షణమే వృద్ధాప్య వికలాంగుల పెన్షన్లు 4000.6000 గా ప్రకటించాలి

**జిల్లా ఇంచార్జ్ ఆడెపు నాగార్జున**




లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా:మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చలో కలెక్టరేట్ పిలుపులో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మరియు చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాను నిర్వహించడం జరిగింది.కలెక్టర్ కార్యాలయం గేట్ మూసివేసి ఆందోళన చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి జిల్లా ఇంచార్జి ఆడెపు నాగార్జున మాదిలేటి మాదిగ మీడియాతో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే వికలాంగులకు రూ 6000 రూపాయలు పెంచాలని అలాగే వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు నేత గీత బీడీ కార్మికుల పెన్షన్లు రూ 4 వేలకు పెంచాలని అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకొని ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ కార్యాలయం లోపలికి వెళ్లి కలెక్టర్ కి వినతి పత్రం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని పెన్షన్ దారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గూటవిజయ్ మాదిగ.నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు.కరీగాళ్ల దశరథంజిల్లా నాయకులుకర్నె పరమేష్ మాదిగగుడిగానిపల్లి రాజు, నల్లకంటి నాగన్న, నల్లగంటి మల్లేష్ నిర్జింత భాస్కర్,వీర పాగా రాములు,పరమేష్, కురమూర్తి,పర్శపాకుల శేఖర్, విష్ణు, యాపట్ల రామకృష్ణ,చంద్రమౌళి రామకృష్ణ %వీ=ూా ఎ=ూా% ఒంటరి మహిళలు వితంతువులు గీత కార్మికులు ప్రభుత్వ పింఛన్లు పొందే ప్రతి ఒక్కరు పాల్గొన్నారు

## అలివి వలలను నిషేదించాలి మత్స్యా శాఖ రజిని కి వినతి

**అమరగిరి భరత్ యాదవ్**



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా: కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామం లో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో అలివి వలలను నిషేధించాలి అని సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా మత్స్యశాఖ రజిని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అలివి వలల ద్వారా చాలా నష్టం జరుగుతుంది. అదేవిధంగా స్థానికంగా ఉన్నటువంటి వారికి ఉపాధి లేకుండా పోతుంది.చిన్న గుడ్డు పిల్లలను అలివి వలల ద్వారా మొత్తం నదిలో చేప పెరగకుండా చిన్నగా ఉన్నప్పుడే అలివి వలలతో అలంపూర్ నుంచి అమరగిరి వరకు... అమరగిరి నుంచి శ్రీశైలం వరకు ఉన్నటువంటి అలవి వలలను నిషేధించాలని నాగర్ కర్నూల్ జిల్లా శాఖ మత్స్య శాఖ అధికారిని కోరడంజరిగింది.బిసానుకూలంగా స్పందించిన జిల్లా మత్స్యశాఖ రజిని తొందర్లోనే సంబంధించిన వాళ్లపైన చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది.బిలేనియెడల జిల్లా మత్స్యశాఖ ఆఫీసు ముందు ధర్నాలు చేపడతామని అలివి వలల తిరుగుబాటు వ్యతిరేక సంఘం నాయకుడు అమరగిరి భరత్ యాదవ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో.. అలివి వలల తిరుగుబాటు వ్యతిరేక సంఘం నాయకుడు అమరగిరి భరత్ యాదవ్, మల్లేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

## మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్). మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు . ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఎప్పటిలాగే జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా జిల్లాలో జ్వరాలు ప్రత్యేకించి టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నాయని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పై దృష్టి వహించేలా అవగాహన కల్పించాలని, రక్షిత మంచినీరు తాగే విధంగా ఆర్డబ్ల్యూఎస్ శాఖ, పరిశుభ్రత గురించి పంచాయతీరాజ్ శాఖ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో శానిటేషన్ నిరంతరం నిర్వహించాలని అన్నారు. మండలాలకు వెళ్ళినప్పుడు ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా వారి పరిధిలోని విద్యాసంస్థలను సందర్శించాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఇంకా వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు స్వీకరించాలని, ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని చెప్పారు. ఈనెల 13న జాతీయ కుటుంబ ప్రాయోజన పథకం కింద బాగా పనిచేసిన ఉద్యోగులను మంత్రుల ద్వారా సన్మానించడం జరుగుతుందని ఆమె తెలిపారు. వివిధ శాఖలలో పని చేస్తూ గ్రామ పాలన అధికారులుగా నియమించబడిన వారిని వెంటనే విధుల నుండి విడుదల చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ కోరారు.



స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, ఇన్చార్జి డిఆర్వో వై. అశోక్ రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, శ్రీదేవి, గృహనిర్మాణ శాఖ పిడి రా,జ్ కుమార్, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కాగ ఈ సోమవారం మొత్తం 87 ఫిర్యాదులు రాగా, 55 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించి వచ్చాయి. 32 ఫిర్యాదులు వివిధ శాఖలకు సంబంధించి ఉన్నాయి

## కొత్ర గ్రామానికి బిటి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని తాసిల్దార్ కి వినతి పత్రం



లోకల్ గైడ్ న్యూస్ సెప్టెంబర్ 09 (కల్వకుర్తి) వెల్దండ మండల పరిధిలోని కొత్ర గ్రామానికి బిటి రోడ్డు మరమాతు పనులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతూ గ్రామ బిజెపి ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్తీక్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. 2001 సంవత్సరంలో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి 2016 సంవత్సరంలో రెన్యువల్ చేశారని , రోడ్డు మొత్తం గుంతల మయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి లో పేర్కొన్నారు. 2022 రోడ్డు మరమ్మతు పనులకు ప్రొజీడింగ్ మంజూరు చేసి శంకుస్థాపనలు చేసి నేటికీ పని పూర్తి కాలేదన్నారు.ఇప్పటికైనా పని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి జై పి మాజీ మండల అధ్యక్షులు జూలూరు బాలస్వామి , భూత్ అధ్యక్షులు బలరాం , జంగయ్య, భూతుకూరి పరమేష్ , మండల వైస్ చైర్మన్ రాజు , గ్రామ నాయకులు దశరథం యాదవ్, భోజరాజు బాలస్వామి, కృష్ణ, మండల సీనియర్ నాయకులు జంగయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్లగొండ బ్రేకింగ్
## మిలాద్-ఉన్-నబీ జులూస్ అనుమతి వినతి

### మిలాద్-ఉన్-నబీ జులూస్ కు అనుమతి కోరుతూ

### మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు డిఎస్పీ శివరాం రెడ్డికి వినతి..




లోకల్ గైడ్ :సెప్టెంబర్ 14న శాంతియుతంగా జులూస్ : దమన్-ఏ-లతీఫ్ షా వలి ? క్లాక్ టవర్ ? ఆర్‌పి రోడ్ ? లతీఫియా గంజ్ ? లతీఫియా దమన్ / మస్జిద్-ఏ-మలాన్ బీ... గతంలో ఇదే మార్గంలో శాంతియుతంగా జులూస్ నిర్వహణ చేసినట్టు డీఎస్పీకి గ కమిటీ అధ్యక్షులు సల్మాన్ ఖాదిరి, జనరల్ సెక్రటరీ ఉభయదుల్లా ఖాద్రీ వివరించారు .సోమవారం నల్లగొండ డిఎస్పి కి వినతి పత్రం సమర్పించారు... ఈ ఏడాది మిలాద్ సెప్టెంబర్ 5 కు ఉన్నా, గణేష్ నిమజ్జన సందర్భంగా సెప్టెంబర్ 14న మార్చినట్టు వివరించారు. హైదరాబాద్ లో సూఫీ పెద్దలు, జులూస్ కమిటీ, ఎంపీలు కలిసి సీఎం చర్చల తర్వాత తుది నిర్ణయం చేశారు అని తెలిపారు... రాష్ట్ర వ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ జులూస్ కు అనుమతి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు... నల్లగొండలో కూడా మిలాద్-ఉన్-నబీ జులూస్ కు అనుమతి ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు .. నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి సానుకూలంగా స్పందించి శాంతియుత వాతావరణంలో ర్యాలీ నిర్వహించాలని సూచనలు చేశారు... కమిటీ తరఫున పాల్గొన్నవారిలో నల్గొండ మున్సిపల్ కౌన్సిలర్ ఇబ్రాహీం సాబ్, మిలాద్ జులూస్ కమిటీ అధ్యక్షుడు సల్మాన్ ఖాద్రీ, జనరల్ సెక్రటరీ ఉబైదుల్లా ఖాద్రీ, సలహాదారులు ఎండి కలీం ఖాన్, అలాగే సభ్యులు అబ్రాబ్ భాయ్, ఫిరోజ్, అఫ్రోజ్, ముషర్రఫ్ ఉన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



లక్షెట్టిపేట :లోకల్ గైడ్ :లక్షెట్టిపేట, సెప్టెంబర్ 8 : మండల విశ్రాంత ఉద్యోగులు కార్యవర్గ ఎన్నికలను సోమవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఈ సారి కూడా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా నేరెళ్ల రాజమల్లయ్య,ప్రధాన కార్యదర్శిగా తిప్పని మధుసూదన్, కోశాధికారిగా రాచర్ల సత్యనారాయణ,అసోసియేట్ అధ్యక్షులుగా జంగం ఆశయ్య, ఉపాధ్యక్షులుగా దేవేంద్ర విజేయుడు, అమీర్ సుల్తానా,జాయింట్ సెక్రటరీగా కొట్టె రాజేశ్వర్, ఆర్గనైజింగ్ గా అన్నం సత్యనారాయణ,ప్రచార కార్యదర్శిగా కొండపర్తి సత్యనారాయణ,జిల్లా కౌన్సిలర్లుగా రాపల్లి భగవాన్ దాస్,రేణిగుంట ప్రసాద్,ఈ సీ మెంబెర్స్ గా రాజా మహేంద్రం, లింగయ్య,సంపూర్ణ, రజాక్,మనోహర్, శంకరయ్య, బాల్ రాజ్,మల్లయ్య,న్యాయ సలహాదారుగా రెడ్డిమల్ల ప్రకాశంలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పాపారావు,పరిశీలకులుగా సత్యనారాయణ,తిరుపతి వ్యవహరించారు. ఈ ఎన్నికలకు జిల్లా అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జగన్ ల సమక్షంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కార్యావర్గాన్ని సభ్యులు అభినందించింది, శుభాకాంక్షలు తెలిపారు.

## కబ్జాకోరులో కొత్ర ఎస్సీల స్మశాన వాటిక కలెక్టర్ కు వినతిపత్రం



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా: నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొత్ర గ్రామంలోని ఎస్సీల స్మశాన వాటిక అస్తవ్యస్తంగా మారింది సర్వేనెంబర్ 241/2 గల ప్రభుత్వ భూమి దాదాపు 40 గుంటల భూమి ఉంటుంది అక్కడ కొన్ని ఏళ్ల తరబడి అక్కడ స్మశాన వాటికలో ఎస్సీల బొందలు పెడతారు కానీ ఇప్పుడు అక్కడ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది పోవడానికి బాటలేదు అక్కడ ఉన్న పట్టాదారుడు కొత్ర గ్రామవాసి డి శంకర్ జి %బా/రా% శివాజీ అను వ్యక్తి మా బొందలను మొత్తం అక్రమంగా కబ్జా చేయడంతో మాకు రాను రాను అస్తవ్యస్తంగా మారింది ఒకరిని బొంద పెట్టిన దాంట్లోనే మరొక్కరిని అందులో పెట్టవలసి వస్తుంది చుట్టుపక్కల మొత్తం దున్ని దున్ని స్వాధీనం చేసుకున్నాడు దయచేసి ఎస్సీల స్మశాన వాటిక పై దయవుంచి యొక్క విషయంపై దృష్టి పెట్టి ఎమ్మటే యాక్షన్ తీసుకొని మా సర్వే నెంబర్లు ఎంతైతే నీవున్నదో భూమిని సర్వే చేసి సరిహద్దులు చూపించిమాకు న్యాయం చేయాలనీ కలెక్టర్ ను కోరారు మాకు చెందిన భూమి ని మాకు అప్పజేప్పిన చో మేము కట్టుదిట్టమైన బౌండరీ వేసుకుంటాము అదేవిధంగా అక్కడ స్నానాలు ఆచరించడానికి ఒక బోరు వేసి వసతులు కల్పించగలరని కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలోని కొప్పు వెంకటయ్య మాజీ వార్డు సభ్యులు బూత్కురి మల్లేష్ కొప్పు హరి ప్రసాద్ బచ్చలకూర కృష్ణయ్య కొప్పు మల్లేష్( ఆర్ఎంపీ) డాక్టర్ శివ మధు నిరంజన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ఆకట్టుకున్న జిల్లా స్థాయి టి.ఎల్.ఎం మేళా

### రాష్ట్రస్థాయికి 6 గురు ఎంపిక.
### జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి



హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల అభ్యాస అనుభవాలను మెరుగుపరచడానికి జిల్లా విద్యాశాఖ మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన పేరుతో జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాను నిర్వహించింది అన్నారు.ప్రభుత్వ బాలికల పాఠశాల, లష్కర్ బజార్ లో ఏర్పాటుచేసిన ఈ మేళాను హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి ప్రారంభించారు. ఈ మేళాలో 14 మండలాల నుండి వచ్చిన140 మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే సమయంలో ఉపయోగించే బోధనోపకరణములు సులభతరమైనటువంటి, ఆకర్షణీయమైన, సృజనాత్మకమైన వి తయారుచేసి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఏ విధంగా విద్యను బోధించాలో ప్రదర్శించారని తెలిపారు. అందుబాటులో ఉన్న అట్ట ముక్కలు, చార్టులు, దినపత్రికలు, వేస్ట్ మెటీరియల్, తర్మోకోల్ షీట్లతో లో కాస్ట్ తో ఈ టి.ఎల్.ఎం సాధనాలను తయారు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిఈవో డి. వాసంతి మాట్లాడుతూ తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్నప్పుడు టీ.ఎల్.ఎం సామాగ్రి అత్యంత అవసరమన్నారు. రెడీమేడ్ గా తయారు చేసిన టి.ఎల్.ఎం కాకుండా ఉపాధ్యాయులు సొంతగా తయారుచేసిన టి.ఎల్.ఎం లను తరగతి గదిలో ఉపయోగిస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి మేళాకు వచ్చిన టి.ఎల్.ఎంలు చాలా నాణ్యతతో ఉన్నాయన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన టి.ఎల్.ఎం లను ఉపాధ్యాయులు మరింత సృజనాత్మకత జోడించి తయారుచేసి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు.మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన హనుమకొండ జిల్లా స్థాయి టిఎల్ఎంల మేళా నుండి తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో మూడు, గణితంలో రెండు, ఈవీఎస్ లో ఒకటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. తెలుగు టిఎల్ఎంలో బహుళకృత్యం కే. రమాదేవి, ఎంపీపీఎస్,పాలకుర్తి, దామర, ఇంగ్లీషులో మల్టీపర్పస్ గ్రిడ్ వి.శ్యాంసుందర్, ఎంపీ యుపిఎస్, తక్కల్లపాడు, దామెర, మరియు మై ఇంగ్లీష్ వరల్డ్ బి.కవిత, ఎంపీ యుపిఎస్, మునిపల్లి, హసన్ పర్తి, గణితంలో జాయ్ ఫుల్ మ్యాథ్స్ కే . కవిత, ఎంపీ యుపిఎస్ ,పులిగిల్ల, నడికుడ, గణితంలో మ్యాథ్స్ విత్ బాంబు స్టిక్ టి .అశోక్ , ఎంపీపీ ఎస్ , వరి కోల్, నడికుడ, ఈవీఎస్ లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్ అండ్ ఎయిర్ ప్రెషర్, పి, చంద్రయ్య, ఎంపీపీ ఎస్ కోతుల నడుమ, ఎలుకతుర్తిఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో గుణాత్మక విద్య కోఆర్డినేటర్ డాక్టర్ బండారు మన్మోహన్, ప్రభుత్వ బాలికల పాఠశాల,లష్కర్ బజార్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, సిఎంవో బద్దం సుదర్శన్ రెడ్డి, హనుమకొండ ఎంఈఓ జి .నెహ్రూ నాయక్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, న్యాయ నిర్ణేతల కమిటీ సభ్యులు వేణు ఆనంద్, మధుసూదన్ రెడ్డి, డైట్ రిటైర్డ్ లెక్చరర్లు ఎం. సోమయ్య, సి.హెచ్. కేశవరావు, రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్లు జి. అశోక్ కుమార్, డాక్టర్ ఎల్. వెంకటరామిరెడ్డి, డాక్టర్ బి.నారాయణరెడ్డి, హారావలి, చంద్రశేఖర శర్మ, డాక్టర్ స్వర్ణలత మరియు 14 మండలాలనుండి 140 పాఠశాలల్లో పనిచేస్తున్న 140 మంది టీచర్లు పాల్గొన్నారు. చివరగా ఈ నెలలో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ డి.ఈ.ఓ వాసంతి ప్రశంస పత్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా లష్కర్ బజార్ బాలికల పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు ఉపాధ్యాయులను ఆకర్షించాయి అన్నారు.



## తహశీల్దార్లు తమ విధులకు సమయానికి హాజరుకావాలి,

### ప్రభుత్వ అభివృద్ధి పనుల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి,

### ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు,

### భూ భారతి ఆర్జిలు, రెవిన్యూ అంశాలపై ఆర్డీవో, తహసిల్దార్లకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాలు,



నాగర్ కర్నూల్ జిల్లాలోకల్ గైడ్ :రెవెన్యూ అధికారులు భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి,సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ పి అమరేందర్ తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ ఆర్డీఓ లతో,20 మండలాల తహసీల్దార్లతో భూ భారతి, ప్రజావాణి ఆర్జీలు, ఇందిరమ్మ ఇండ్లకి ఇసుక సరఫరా, మీసేవ సర్టిపికెట్ల పెండింగ్ పై, పలు రెవిన్యూ అంశాలపై కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమీక్షించారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...... తహశీల్దార్లు ప్రతి రోజు ఉదయం 10:30 గంటలకు తప్పనిసరిగా కార్యాలయానికి హాజరు కావాలి. జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానం తప్పనిసరిగా అమలు చేయాలి, ఉద్యోగుల నెలవారీ జీతాలు బయోమెట్రిక్ హాజరు వివరాల ఆధారంగానే విడుదల చేయబడతాయిని జిల్లా కలెక్టర్ తెలిపినారు. అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తాను, జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాలకు ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేపడతామని ఈ తనిఖీల సందర్భంలో తహశీల్దార్లు లేదా ఇతర సిబ్బంది విధుల్లో లేకుండా అనధికారికంగా గైర్హాజరు ఉన్నట్లు గుర్తిస్తే, వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. అధికారుల హాజరు, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం తప్పనిసరి అని, ప్రజలకు సమయానుసారంగా సేవలు అందించడానికి కలెక్టర్ స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ విభాగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ చెప్పారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు పారదర్శకతతో ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాల్సిన అవసరాన్ని కలెక్టర్ వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని భూ సమస్యల పరిష్కారానికి ఈ చట్టం రూపుదిద్దుకుంది అని ఆయన గుర్తుచేశారు. తిరస్కరించబడిన ప్రతి దరఖాస్తుపై సరైన కారణాలు తెలియజేయాలని, తహసిల్దార్లు ఆ తిరస్కరణ వివరాలతో ప్రొసీడింగ్‌ను దరఖాస్తుదారుడికి అందజేయడం తప్పనిసరి అని తెలిపారు. మండలాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను శు క్రవారం నాటికి కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో స్లాట్ బుక్ చేసిన లబ్ధిదారులకు అదే రోజు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, తహసిల్దార్ అందుబాటులో లేకుంటే డిప్యూటీ తహసిల్దార్‌ను ఇన్‌ఛార్జిగా నియమించాలనీ ఆదేశించారు. కార్యాలయాల్లో రోజువారీ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఒక రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలి, క్షేత్రస్థాయిలో కలెక్టర్, ఆర్డీవోలు చేసిన తనిఖీల సమయంలో ఆ రిజిస్టర్‌ను పరిశీలిస్తారని తెలిపారు.సాదా బై నామాల వివరాలను మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించి చర్చించారు. ప్రతి మండలంలో ఉన్న సాదా బై నామాల సంఖ్య, వాటి ప్రస్తుత స్థితి, చట్టపరమైన సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు.ప్రభుత్వ అభివృద్ధి పనులకు కావలసిన భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. హైకోర్టు, సివిల్ కోర్టు, లోకాయుక్తకు సంబంధించిన కేసులను కూడా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసిన ఆదాయ, కుల ధృవీకరణ, రెసిడెన్సీ వంటి సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ఆమోదం తెలపాలని సూచించారు.ప్రజలకు సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, వాటి నిర్మాణానికి కావలసిన ఇసుకను ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. గ్రామాల వారీగా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాను సక్రమంగా నిర్వహించడానికి రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు సమన్వయం చేసుకోవాలి అని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు జనార్దన్ రెడ్డి, బన్సీలాల్, సురేష్ బాబు, మాధవి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరిండెంట్లు రవికుమార్, వెంకట్, శోభా తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్, మహబూబ్ నగర్ తరహాలో నాగర్ కర్నూల్ లో కూడా 5/- ల భోజనం క్యాంటీన్ ను ప్రజలపరం చేయాలి - బిఎస్పీ



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా:సోమవారం బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో బిఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇ ప్రెస్ మీట్ ను ఉద్దేశించి బిఎస్పీ అసెంబ్లీ ఇంచార్జ్ కొత్తపల్లి కుమార్, జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్, జిల్లా ఇంచార్జ్ కళ్యాణ్, రాష్ట్ర మాజీ ఈసీ మెంబర్ పృధ్వీరాజ్ లు మాట్లాడారు. నాగర్ కర్నూల్ లో ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంఎల్సీ - మాజీ ఎమ్మెల్యేకు జరుగుతున్న మాటల వ్యవహారాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీలకు అతీతంగా ఆధిపత్య కులాల నాయకులు అంతా ఒకటే అనీ విమర్శించారు. హైదరాబాద్ మహా నగరంలో ఎన్నో ఏండ్లుగా, మహబూబ్ నగర్ లో కొన్ని సంవత్సరాల నుండి మున్సిపల్ కార్పొరేషన్లు 5/-ల భోజనాన్ని అందిస్తుంటే - ఆ పని నాగర్ కర్నూల్ లో ఎందుకు చేయొద్దు అనీ అడిగారు. ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంఎల్సీ నాగర్ కర్నూల్ ప్రజలకు నిజమైన చిత్తశుద్ధి ఉంటే తక్షణమే 5/-ల భోజనం క్యాంటీన్ ను ప్రజలపరం చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయడం ద్వారా ఎవరూ ఎమ్మెల్యేలు ఉన్న, ఎవరూ ఎంఎల్సీలు ఉన్న, ఎవరూ ఎంపీలు ఉన్న ప్రజలకు రాజకీయ గెలుపు ఓటములకు అతీతంగా 5/-ల భోజనం నిరంతరం అందుతుందని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో మాజీ ఎమ్మెల్యే క్యాంటీన్ ఎలా ఉంటుందని ప్రశ్నించారు..? దీనిపై చర్యలు తీసుకునే అధికారం ప్రజలు ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంఎల్సీలకు ఇచ్చారు కదా అని నిలదీశారు. మరి ఆ అధికారం ఎందుకు ప్రజలకోసం ఉపయోగించరు అనీ గర్జించారు. అదే ప్రభుత్వ స్థలంలో మాజీ బిఆర్ఎస్ కౌన్సిలర్ బార్ %ఉ% రెస్టారెంట్ ఎందుకు ఉంటుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏమో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాళేశ్వరం కమీషన్, ఫోన్ ట్యాపింగ్ కేసులు పెడుతూ వారు తప్పు చేశారు ప్రజలకు తెలియజేస్తున్నారు అలాంటప్పుడు మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరుల తప్పులను ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంఎల్సీలు ఎందుకు దాచాలని అడిగారు. నల్లమట్టి, ఎర్రమట్టి దందాలపై నిజానిజాలు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యే, ఎంఎల్సీలకు లేదా అనీ స్పష్టం చేశారు. జక్కారఘునందన్ గారిపై తిమ్మాజీపేట్ %ఖాాజూ% లో వచ్చిన అవినీతి ఆరోపణలు నిజాలు ఆ, కాదా అనీ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విధంగా పేపర్ ఆరోపణలు చేసుకుంటూ నాగర్ కర్నూల్ ను అసెంబ్లీని 40 ఏండ్లు వీళ్ళ ఖంబధ హస్తాల్లో పెట్టుకున్నారని, ఇప్పటికీ ఐనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరియు అన్ని కులాల పేదలు చైతన్యం అయి బహుజన రాజ్యాధికారం తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. ఆ మార్గం తప్ప బహుజనులకు మరో మార్గం లేదని తెలిపారు. అట్లాగే యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కారణం అవుతున్నాయని జిల్లాల్లో యూరియా కొరత రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ముఖ్యంగా పోలీస్ స్టేషన్లు పార్టీలకు అతీతంగా పేద ప్రజల కోసం నిరంతరం పని చేయాలని అన్నారు. అలా పని చేయని పక్షంలో బిఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. ఇ కార్యక్రమంలో బిఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు మడుపు నాగేష్ ( నల్లవెల్లి మాజీ డిప్యూటీ సర్పంచ్), అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి భాస్కర్, తిమ్మాజీపేట్, తెల్కపల్లి మండల అధ్యక్షులు రాజు, బాలనాగులు, నాయకులు శ్రీను, నరేష్, బిఎస్ఎఫ్ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు సాయిబాబు, బీవీఎఫ్ జిల్లా కన్వీనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా

**అగస్త్య హాస్పిటల్స్, వినాయక న్యూరో కేర్ మల్టీ స్పెషాలిటీ సెంటర్ సౌజన్యంతో నిర్వహణ**

**వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**



హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్):దైనందిన జీవితంలో శారీరక సామర్థ్యానికి ఫిజియోథెరపీ ఎంతో అవసరం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ, అగస్త్య హాస్పిటల్స్, వినాయక న్యూరో కేర్ మల్టీ స్పెషాలిటీ సెంటర్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఫిజియోథెరపీ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, తాను ఒక క్రీడాకారున్ని అని ఫిజియోథెరపీ యొక్క ప్రాముఖ్యత ఏంటో తనకు ప్రత్యక్షంగా తెలుసని అన్నారు. ముఖ్యంగా పక్షవాతం, మెడ నొప్పి,నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పులు, భుజం నొప్పులు వంటి అనారోగ్య పరిస్థితులు ఉన్నప్పుడు ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం పొందవచ్చు అన్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఫిజియోథెరపీ ద్వారా పేషెంట్ కు ముఖ్యంగా క్రోనిక్ డిసీజెస్ అయిన పక్షవాతం, కీళ్ల నొప్పులు వంటి నొప్పులకు శాశ్వత వైద్యం ఫిజియోథెరపీ ద్వారా ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందన్నారు అదేవిధంగా పిల్లల ఎదుగుదల లోపాలున్న,కాళ్లు చేతులు సరిగా పనిచేయకపోయినా, ముసలి వాళ్ళలో కండరాల సమస్యలు, నరాల సమస్యలు వంటివి ఉన్నట్లయితే ఫిజియోథెరపీ ద్వారా పూర్తిగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 10 ఫిజియోథెరపీ కళాశాలలు మంజూరు చేసినందుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఫిజియోథెరపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు సహకారం అందిస్తే గ్రామ గ్రామాన ఫిజియోథెరపీ సెంటర్లు పెట్టి ప్రజలకు సేవ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు పొట్లపల్లి శ్రీనివాసరావు, కన్నా పరశురాములు, ఎం. పద్మజారాణి, డాక్టరు రాము, సౌజన్య, కాకతీయ, వాగ్దేవి ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థినీ,విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా గ్రంథాలయ సర్వసభ్య సమావేశం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. (లోకల్ గైడ్). జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం ఏ హఫీజ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. 1. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచనల మేరకు ముఖ్యమంత్రి డిసెంబర్ 24 న స్థానిక పాత టౌన్ స్థలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్మించుటకు శంకుస్థాపన చేసినారని జిల్లా కలెక్టర్ అనుమతితో నిర్మించాలని తీర్మానించనైనది. 2. జిల్లా కేంద్ర గ్రంథాలయము తో పాటు, నాగార్జునసాగర్, చందంపేట, మునుగోడు, దేవరకొండ తో పాటు ఇతర గ్రంథాలయ నిర్వహణకు స్థానిక ఎమ్మెల్యే నిధుల నుండి మంజూరు చేయుటకు తీర్మానించినారు3. జిల్లా గ్రంథాలయాలతో పాటు ఇతర గ్రంథాలయాల్లో పనిచేయుచున్న స్వీపర్ చార్జీలు 25 శాతం పెంచుటకు తీర్మానించినారు4. జిల్లా గ్రంథాలయ సంస్థలలో పాటు ఇతర గ్రంథాలయంలో పాత పుస్తకాలు రద్దు చేయుటకు సంచాలకుల వారికి ప్రతిపాదన పంపుటకు కూడా తీర్మానించనైనది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన గ్రంథాలయ కార్యదర్శి, జిల్లా విద్యాశాఖ, అడల్ట్ ఎడ్యుకేషన్, పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# నేత్ర దాతలకు ఘనసన్మానం....
# అధ్యక్షుడు కోన్ రెడ్డి మల్లారెడ్డి వెల్లడి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య,**

**ప్రాంతీయ నేత్ర వైద్య శాల వరంగల్ హాస్పిటల్ సూపరిండెంట్ భరత్ కుమార్**




హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్):జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలలో భాగంగా చివరి రోజు ముచర్ల గ్రామంలో తెలంగాణ నేత్ర అవయవ,శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య,ప్రాంతీయ నేత్ర వైద్య శాల వరంగల్ హాస్పిటల్ సూపరిండెంట్ భరత్ కుమార్,1వ డివిజన్ కార్పొరేటర్ వరంగంటి అరుణకుమారి ప్రొఫెసర్ డాక్టర్ హరిదేవరాజ్ అసోసియేషన్ ప్రతినిధులు, గ్రామ ప్రజలతో నేత్ర దాన అవగాహన నిమిత్తం నినాదాలతో పెద్ద ఎత్తున ముచ్చర్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.అనంతరంసమావేశం నిర్వహించి గ్రామంలోని 56 మంది నేత్రదాతల కుటుంబ సభ్యులకు శాలువాలతో సత్కరించి, అభినందనలపత్రం ఇచ్చి , ధన్యవాదములు తెలిపారు. ఈ సమావేశంలో అందరం నేత్ర, శరీర దానం పట్ల అవగాహన కల్గి యుండాలని అధికారులు వివరించారు.ముచర్ల గ్రామ ప్రజలను రాష్ట్రము లోని అన్ని గ్రామాల ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, బోగి సుజాత,పద్మ, రవీందర్,కోన్ రెడ్డి మల్లారెడ్డి, నర్సింరాములు,జనార్దన్ రెడ్డి,కేదారి,రాజమణి, సాయిరెడ్డి,యోగా మాస్టర్ భాస్కర్,అధ్యాపకులు సాంబయ్య,వీరాస్వామి, గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.



# వ్యవసాయ కూలీల
# సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కు వినతి




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వ్యవసాయ కార్మికులు,ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని,వారి సమస్యలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి 2లక్షల70వేల కోట్లు కేటాయించిన సంవత్సరంలో 200రోజులు పనులు కల్పించి రోజుకు 7వందల రూపాయల కూలి ఇవ్వాలని,అదేవిధంగా ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని,కనీస మౌలిక సదుపాయాలు కల్పించి,సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని చేసి పటిష్టవంతంగా అమలు జరపాలని కోరారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ,బడుగు బలహీన వర్గాలపై మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు జరిపి వ్యవసాయ కార్మిక కుటుంబానికి 12వేలు ఇవ్వాలని,సామాజిక పెన్షన్లు 4వేలు,వికలాంగులకు 6వేలకు పెంచాలని,అర్హత కలిగిన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.,వ్యవసాయ కార్మికులకు 50సంవత్సరాలు పైబడిన వారందరికీ నెలకు 6వేల పెన్షన్,మహిళలకు గృహలక్ష్మీ పథకం కింద నెలకు 2వేల5వందలు ఇవ్వాలని,పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చి,ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని,ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు 25లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా,రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లకు మహిళలకు,ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 6లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు అక్క పెల్లి బాపు,గుండా చంద్ర మాణిక్యం,కొండు బానేష్,ఆడెపు రాజమౌళి,బొంతల లక్ష్మీనారాయణ,చిప్ప నరసయ్య,కొంకుల రాజేష్,బొల్లం తిలక్ అంబేద్కర్,రత్నం రాజం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి కరువైన ఆదరణ

- గత నెల రోజుల నుంచి ఒక్క దరఖాస్తు రాని వైనం.
- పూర్తిస్థాయి అధికారులు లేకపోవడమే ఓ కారణం అయితే.
- ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడం.
- ప్రజావాణి పైన అవగాహన కల్పించకపోవడమే మరో కారణం.
- అవిశ్వాసం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు.





లోకల్ గైడ్ /తాండూర్: ప్రజల సమస్యల కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి, మండల ప్రజల నుంచి ఆదరణ కరువైంది. పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరై, ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం. ఇదిలా ఉంటే గత నెల, రెండు నెలల నుంచి పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి ఫిర్యాదులు రావడం లేదు.అయితే ప్రజలు గతంలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడమే ఇందుకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ మండల స్థాయిలో మాత్రం ప్రజావాణి అందుకు భిన్నంగా సాగుతుంది. ప్రజలకు ప్రజావాణి పైన అవగాహన లేకపోవడం ఓ ఎత్తైతే, అవగాహన కల్పించడంలో మండలాధికారులు పూర్తిగా జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కావున ప్రజావాణిలో ఫిర్యాదులు చేయలేకపోతున్నామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్కటంటే ఒక్క ఫిర్యాదు రాకపోవడం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తుంది.ప్రతి వారం మెజార్టీ అధికారుల గైర్హాజరు.మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ, ప్రజావాణి కార్యక్రమంలో ప్రతి సోమవారం మండల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం పట్ల ప్రజల విశ్వాసం తగ్గినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజావాణిలో మండల అధికారులు పూర్తిస్థాయిలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని మండల ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు

# సిపి గేట్ ఫలితాలలో









## అద్భుత విజయాలు సాధించిన ఎం.వి, ఎన్ విజ్ఞాన కేంద్రం.


నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .(లోకల్ గైడ్).సి పీ గేట్ ఫలితాల్లో ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రం నేతృత్వంలో నడుస్తున్న, నల్లగొండ ఎకనామిక్స్ ఫోరమ్ ఎకనామిక్స్ విభాగంలో 1,2,3,6,12,13,14,17 20, 22 , 27 ర్యాంకులతో మరోసారి అత్భుత ఫలితాలను సాధించిందని విజ్ఞాన కేంద్రం కన్వీనర్, ఫోరమ్ అధ్యక్షులు డా. అక్కెనపల్లి మీనయ్య తెలిపారు. మొదటి ర్యాంక్ ను ఎస్. భువన లక్ష్మి, రెండవ రాంక్ ను ఎన్.అజయ్, మూడవ ర్యాంక్ ను ఏ. మానస, ఆరవ ర్యాంక్ వై. లోకేష్ సాధించినారని ఆయన పేర్కొన్నారు. తొమ్మిది 20 లోపు రాంకులను సాధించి ఫోరమ్ విద్యార్థులు మరోసారి అద్భుత ఫలితాలు సాధించినారని తెలిపినారు. 40 రోజులపాటు నిర్వహించబడిన ఆన్లైన్ క్లాసులు, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ లతో వారు శిక్షణ పొందినారని, అందుకు తగ్గ ఫలితాలు వచ్చినాయని ఫోరమ్ అసోసియేట్ అధ్యక్షులు త్రిపురం భాస్కర్ రెడ్డి, కార్యదర్శి షేక్ సుల్తానా, ఉపాధ్యక్షులు డా.దుబ్బ రంజిత్, ఉప కార్యదర్శి డా.అక్కెనపల్లి దీపిక సంతోషాన్ని వ్యక్తం చేసినారు. ఈ సంవత్సరం ఫోరమ్ నిర్వహణ ఖర్చులు 70 వేల రూపాయలను ఎన్ ఎల్ ఎన్ ఫౌండేషన్ బాధ్యులు నాతి శ్రీనివాస్ , సర్వ్ ది పూపిల్ భాద్యులు నాతి గణేష్ లు సంయుక్తంగా ఫోరమ్ కు డొనేట్ చేసినారని వారికి ఫోరమ్ తరపున కృతజ్ఞతలు తెలుపుతూన్నామని అన్నారు. ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నంద్యాల నర్సింహా రెడ్డి, కోశాధికారి జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, విజ్ఞాన కేంద్రం కార్య నిర్వహణ కార్యదర్శి పూచ్చకాయల నర్సిరెడ్డి ఫోరమ్ ఫలితాలపట్లడా. అక్కెనపల్లి మీనయ్య హర్షం వెళ్లిబు చ్చారు

# ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార లోప నిర్మాలను కార్యక్రమం

పోషకాహారలోప నిర్మూలన తోనే ప్రగతి సాధ్యం




( లోకల్ గైడ్ షాద్ నగర్ )ప్రగతి వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తున్న పోషకాహారలోప నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గత రెండు రోజుల్లో సంస్థ బృందం ఉమ్మడి బూర్గుల పంచాయతీ లోని బూర్గుల, కాశిరెడ్డిగూడ, బూరుగడ్డతండా, చింతగూడ, నేరలచెరువు, కడియాలకుంటతండా, సూర్యజ్యోతి ప్రాంతంలను ప్రగతి ఛాంపియన్లు మరియు వాలంటీర్లతో కలిసి సందర్శించి పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించేందుకు మొత్తం 700 మంది పది సంవత్సరాల లోపు పిల్లలకు ఎత్తు, బరువు మరియు ఎంయుఏసి కొలతలు తీసుకోవడం జరిగింది. గ్రామస్థులకు పోషకాహారలోప నిర్మూలన ప్రాజెక్ట్ మరియు రాబోయే 1516 తేదీలలో నిర్వహించే బాలస్వస్థ వైద్య శిబిరం ఏర్పాటు పై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే, పిల్లల కొలతలను వారి ఇళ్ల గోడలపై గుర్తుగా వ్రాయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సిబ్బంది నవ్య, ప్రగతి, లావణ్య, తులసి, శ్రీకాంత్, కార్తిక్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ మురళి కృష్ణ,ద్యాగ శంకర్, 9 మంది ప్రగతి ఛాంపియన్లు మరియు మూన్‌రే కాలేజీ నుండి 20 మంది విద్యార్థి వాలంటీర్లు పాల్గొనడం జరిగింది.




# జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు వినియోగించుకోవాలి

## ఎస్పీ డి.జానకి,




మహబూబ్ నగర్ జిల్లా సెప్టెంబర్ 8 (లోకల్ గైడ్):మహబూబ్ నగర్ సెప్టెంబర్ 13వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి. జానకి, తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులలోక్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన కేసులు,కుటుంబపరమన కేసులు,వైవాహిక జీవితం సంబంధిత కేసులు,బ్యాంకు రికవరీ,విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ కేసులు,వంటి వివిధ కేసుల్లో ఇరువర్గాల మధ్య రాజీకి అవకాశం ఉంటుందని వివరించారు.రాజీయే రాజమార్గం. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దు. జుడీషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి” అని ఎస్పీ సూచించారు.జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

## ప్రభాత కెరటాలు కవితా సంపుటి ఆవిష్కరణ



భద్రాద్రి కొత్తగూడెం అశ్వారావుపేట : లోకల్ గైడ్ : పట్టణానికి చెందిన ప్రముఖ కవి సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు వ్రాసిన ప్రభాతకెరటాలు కవితా సంపుటి ఆవిష్కరించబడింది. ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమి తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన ఆవిష్కరణ సభలో తెలంగాణా సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సాహిత్యం తెచ్చిన కవి కలకాలం గుర్తుండిపోతాడని ప్రభాకరాచార్యుల రచనలు సమాజహితం కోరేవిగాను ఆలోచింపచేసేవిగాను ఉంటాయని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త కర్నూల్ పూర్వ డి.ఐ.జి ఇక్బాల్, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత బాలసాహితీవేత్త నారంశెట్టి ఉమామహేశ్వరరావు, ధర్మకేతనం అధ్యక్షులు రఘువీరప్రతాప్, నేటినిజం సంపాదకులు బైస దేవదాస్, కన్నడ కవులు జోషి, రమేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తు ను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు (150)..,హనుమకొండ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాలను అందజేశారు. ప్రజలు వినతి పత్రం అందజేస్తూ తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వచ్చిన ప్రతి దరఖాస్తును స్వీకరిస్తూ ప్రజలు తమ సమస్యలను చెప్పగా కలెక్టర్ ఓపిగ్గా వింటూ సమాధానం ఇచ్చారు. వినతి పత్రం స్వీకరించిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 150 వినతులను ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, డిఆర్డివో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, సిపిఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు

## భార్యను వేదించిన భర్తకు ఏడాది జైలు శిక్ష

### రూ. 500 రూపాయల జరిమానా

### జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ బి. సరోజ




వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ (లోకల్ గైడ్ తెలంగాణ) భార్యను వేదించిన భర్తకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు 500 రూపాయలు జరిమానా విదిస్తూ కోడంగల్ జుడీష్యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీరామ్ తీర్పు వెల్లడించినారని మహిళా పోలీసు స్టేషన్ సిఐ బి. సరోజ తెలిపినారు. వివరాలలోకి వెళితే 10.08.2019 రోజున లగచెర్ల గ్రామానికి చెందిన చౌదర్పల్లి సుజాత మహిళా పోలీసు స్టేషన్ కు వచ్చి తన భర్త మరియు అత్త మామలు అంతా కలిసి తనను అదనపు వరకట్నం కోసం వేదిస్తున్నారు అని ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ జి. శ్రీకాంత్ కౌన్సెలింగ్ నిర్వహించిన పిదప కేసును నమోదు చేసి విచారణ జరిపి నేరస్తుల మీద చార్జ్ షీట్ ను దాఖలు చేసి కోడంగల్ కోర్ట్ నందు సమర్పించగా కోడంగల్ మెజిస్ట్రేట్ కేసు యొక్క పూర్వ పరాలు పరిశీలించిన పిదప నేరస్తునికి సంవత్సరం పాటు జైలు శిక్ష మరియు 500 రూపాయలు జరిమానా విదిస్తూ తీర్పు వెల్లడించినారు. ఇట్టి కేసులో నేరస్తునికి శిక్ష పదడేవిదముగా పని చేసిన కోర్ట్ డ్యూటి ఆఫీసర్ సి. రామకృష్ణను మహిళా పోలీసు స్టేషన్ సిఐ బి. సరోజ అబినంధించినారు.

## తాసిల్దార్ కార్యాలయంలో రైతు ఆత్మహత్యాయత్నం




మిడ్జిల్ సెప్టెంబర్ 8(లోకల్ గైడ్): తమకు న్యాయం చేయాలని మిడ్జిల్ తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం తాసిల్దారు ముందు వాడ్యాల గ్రామానికి చెందిన గజ్జల కృష్ణయ్య తన తల్లితో కలిసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు 156 సర్వే నెంబర్లు తన పేరు మీద మూడు కుంటల భూమి ఉన్నదని పొలం పాసుబుక్కులు కూడా ఉన్నాయని కానీ పొజిషన్ దగ్గరకు రానివ్వడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది వెంటనే రైతు చేతిలో నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు అనంతరం రైతు నుండి పూర్తి వివరాలు సేకరించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని రైతుకు సూచించారు అలాగే పొజిషన్ మీదికి రానివ్వని వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తాసిల్దార్ రాజు సూచించారు

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



మిడ్జిల్ సెప్టెంబర్ 8(లోకల్ గైడ్): మిడ్జిల్ మండల పరిధిలోని రాణి పేట గ్రామంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు సోమవారం ర్యాలీ నిర్వహించారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవ భారత్ సాక్షరతా కార్యక్రమం లో భాగంగా ఉల్లాస్ ను ఉద్దేశించి గ్రామంలోని వయోజనులు అందరూ చదువు నేర్చుకోవాలని అవగాహన కల్పిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిరంజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్ ..పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ త్యాగాలు మరువలేనివి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### వీరనారి ఐలమ్మ మహిళా లోకానికి స్ఫూర్తి..

### కల్వకుర్తి నియోజకవర్గంలోని రావిచేడులో కార్యక్రమం..

### పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బిజెపి నేత ఆచారి





( లోకల్ గైడ్ షాద్ నగర్ )దేశంలో కొందరు మహనీయులు స్వతంత్ర పోరాటం కోసం రంగంలోకి దిగితే, కొందరు సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని, అలాంటి వారిలో వీరనారి ఐలమ్మ కూడా ఒకరిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని రావిచేడు గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్వాతంత్రం వచ్చాక అసమానతలు లేని ప్రపంచాన్ని సృష్టించేందుకు మహాత్మా గాంధీ కన్నకలలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిజం చేశారని గుర్తు చేశారు. ఇలాంటి మహానుభావులను నిత్యం తలుచుకొని వారిని పూజించాలని అన్నారు. చాకలి ఐలమ్మ త్యాగాలు మరువలేనివని, బడుగు వర్గాల ఉన్నతికి ఆమె ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. సేవా తత్పరతకు, త్యాగ నిరతికి కులాలు, మతాలతో సంబంధం ఉండదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ఆనాటి చాకలి ఐలమ్మ కాలం నుంచి నేటిదాకా దేశం కోసం నడుము కట్టిన మహిళా మండలి ఎందరో ఉన్నారని అన్నారు. చట్టసభలలో 33 శాతంమహిళా రిజర్వేషన్ అమలు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు. వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా కష్టపడి పని చేస్తున్నారని, ఏ అవసరం ఉన్న నేరుగా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి మాట్లాడి అభివృద్ధి వైపు అడుగులు వేస్తారని అన్నారు. బిజెపి నేత ఆచారి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల విషయంలోనైనా, ఇతర ఏ సంక్షేమ పథకాలలోనైనా బీసీలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్థానిక ఎమ్మెల్యే ఎందుకోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పోరాటంలోనూ బీసీల పాత్ర ఉందని, కానీ ప్రతి చోటా బీసీలు వెనుకబడి ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల భవిష్యత్తు కోసం నిరంతర పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు..

# వివాదాలకు కేరాఫ్ అడ్రస్ కన్నాయిగూడెం గ్రామపంచాయతీ?

### నిబంధనలు ఉల్లంఘిస్తున్న గ్రామ కార్యదర్శి?

### అధికారులంతా అధికార పార్టీయేనా?

### ప్రత్యేక అధికారి ఊసే లేదు!

### సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు!




భద్రాద్రి కొత్తగూడెం అశ్వారావుపేట : లోకల్ గైడ్ :మండల పరిధిలోని కన్నాయిగూడెం గ్రామపంచాయతీ వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతుందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి నియమించబడిన గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రజల సమస్యలు పరిష్కరించుట ఏమోగానీ అవినీతి, లంచగొండి అవతారం ఎత్తి ప్రజలను దోపిడీ చేస్తున్నాడని, ప్రతి పనికి ఒక రేటు కట్టి వసూళ్ల పర్వానికి తెర లేపారని ప్రజలు విస్తృతంగా చర్చించుకుంటున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు ఏ పని కావాలన్నా పంచాయతీ కార్యదర్శి విచారణ చేయాల్సి ఉంటుందని, విచారణ పేరుతో ప్రజల వద్ద ముక్కు పిండి మరి వసూళ్లు చేస్తున్నారని గతంలో అనేక వార్తలు మీడియాలో కూడా రావడం జరిగిందని, అంతేకాకుండా అధికార పార్టీ నాయకుల కనుసనల్లోనే పంచాయతీ కార్యదర్శి అనేక అక్రమాలకు ఒడిగడుతున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి కూడా గతంలో అధికారంలో ఉన్న అధికార పార్టీ లీడర్ల కనుసన్నల్లో పనిచేసి అర్హత కలిగిన ప్రజలకు అన్యాయం చేశారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో మందలించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. అయినప్పటికీ తీరుమారని గత పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయడం కూడా జరిగిందని, అనంతరం వచ్చిన కార్యదర్శి కూడా అధికార పార్టీ నాయకులు ఏది చెప్తే అదే చేస్తున్నారని, పంచాయతీ కార్యదర్శి రాజకీయ నాయకుల చెప్పుచేతల్లో ఉండటం వలన అనేకమంది ప్రజల సమస్యలు తీరే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామపంచాయతీలో ఐదు గ్రామాలు ఉండగా నీటి సమస్య, వీధిలైట్లు, పారిశుద్ధ్యం, రోడ్లు అనేక సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారని, ఆ సమస్యలను పరిష్కరించాల్సిన పంచాయతీ కార్యదర్శి కానీ, పంచాయతీకి కేటాయించిన ప్రత్యేక అధికారులు కానీ, మండల పరిషత్ అధికారులు కానీ ప్రజా సమస్యల వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు పుంకాలు పుంకాలుగా వినిపిస్తున్నాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే, పంచాయతీ కార్యదర్శి ప్రతిపనుల్లో లంచం డిమాండ్ చేస్తూ ప్రజలను రాచి రంపాన పెడుతున్నట్లు అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శి అవినీతి ఆరోపణలపై మీడియాలో అనేక వార్తలు వచ్చినప్పటికీ, నేరుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో కు ఫిర్యాదు చేసినప్పటికీ కనీస విచారణ కూడా చేయడం లేదని, తిలా పాపం తలా పిడికెడులా మండల పరిషత్ అధికారుల పనితీరు ఉన్నదని, పంచాయతీ కార్యదర్శి అవినీతిపై ఫిర్యాదు చేసినప్పటికీ మండల పరిషత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని ప్రజలు వాపోతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీ అభివృద్ధి కుంటు పడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక అధికారులు నియమించినప్పటికీ, పేరుకే ప్రత్యేక అధికారులు తప్ప ఎటువంటి అజమాయిషి కూడా గ్రామపంచాయతీలో లేదని, దీనితో రెచ్చిపోతున్న పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నారని, సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, సమస్యల గురించి మాట్లాడితే నిధులు లేవంటూ చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడిందని, దోచుకోవడం దాచుకోవడం లాగానే పంచాయతీ కార్యదర్శి పని విధానం ఉందని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, మండల పరిషత్ అధికారులు, నియమించబడిన ప్రత్యేక అధికారులు దృష్టిసారించి కన్నాయిగూడెం గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకొని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కన్నాయిగూడెం గ్రామ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించని ఎడల నేరుగా జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో ఏకరూప దుస్తుల ఉచిత పంపిణీ

### ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్



హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్):హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్ అధ్యక్షతన రిటైర్డ్ ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ మేకల పరుశరాములు జ్ఞాపకార్థం వారి కుమార్తె చింతనిప్పుల శశికాంత వృత్తి విద్య కళాశాలలో విద్యను అభ్యసించే తల్లిదండ్రులు లేని, దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు (యూనిఫాంస్) ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హనుమకొండ జిల్లా ఇంటర్ విద్యాధికారి ఏ. గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కనీస అవసరాలు తీర్చుకోలేని విద్యార్థిని, విద్యార్థులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చిన దాతలను అభినందించి, సన్మానించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యనభ్యసించే ప్రభుత్వ కళాశాలను బలోపేతం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ లెక్చరర్స్ మేకల కృష్ణ, మేకల విష్ణుకాంత్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్.ప్రవీణ్ కుమార్, అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు



# డల్లాస్ ఆప్త బిజినెస్ ఫోరంలో

## -మిర్యాల రాఘవరావుకు ఘన సన్మానం



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి): డల్లాస్ అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో డల్లాస్‌లో జరిగిన బిజినెస్ ఫోరంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మిర్యాల రాఘవరావు ప్రత్యేక



ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో హైటెక్, స్టార్టప్, తయారీ రంగాలలో పెట్టుబడులు పెడితే లాభాలతో పాటు ఉద్యోగ సృష్టికి దోహదం అవుతుంది అని అన్నారు. హైదరాబాద్ లో ఆప్త కార్యాలయం ఏర్పాటు చేస్తే అమెరికా, భారత పారిశ్రామికవేత్తల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడుతుందని సూచించారు. మరుసటి రోజు జరిగిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో కూడా రాఘవరావు వ్యాపార సంబంధిత సూచనలు పంచుకున్నారు. అమెరికాలో తెలుగు సమాజం వ్యాపార అవకాశాలను వినియోగించ డంతో పాటు భారతదేశంలో కూడా పెద్దగా పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణం లో విజయవంతంగా ముగిసింది.

# పొదెం వీరయ్య వెంట కలిసి నడుస్తానంటావు...

### బీఆర్ఎస్ లోనే ఉన్నానంటావు..

### ఏమి ఈ సోద్యంఎమ్మెల్యే మాటలు

### నమ్మి పార్టీ మారిన కార్యకర్తలారా ఇకనైనా ఆలోచించండి

### బీఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మానెం రామకృష్ణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల : లోకల్ గైడ్ : తన వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఇప్పుడు అనర్హత వేటు పడుతుందనేసరికి ఈ రోజు నేను బీఆర్ఎస్ పార్టీ లోనే ఉన్నానని, టీవి 9 ఇంటర్వ్యూలో చెప్పుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానెం రామకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు. మళ్ళీ పొదెం వీరయ్య వెంట కలిసి నడుస్తానంటావు... బీఆర్ఎస్ లోనే ఉన్నానంటావు.... ఒక్క మాట స్థిరంగా లేని అతని మాయమాటలు నమ్మినవారు, పార్టీ మారిన నాయకులు కార్యకర్తలు ఒకసారి ఆలోచన చేయండంటూ, నిలకడలేని ఈ నాయకుడి మాటలు నమ్మి మీ రాజకీయ జీవితాన్ని నాశనం చేసుకోకండని, తన వ్యక్తిగత స్వప్రయోజనాల కోసం పార్టీ మారి కన్న తల్లి లాంటి పార్టీని వెన్నుపోటుపోడవడం అవుతుందని అన్నారు. కచ్చితంగా అతని గెలుపుకోసం పగలనక రాత్రనక నిద్రాహారాలు మాని కృషిచేసిన కార్యకర్తలు, మీరు బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెసు పార్టీలో చేరిన నాయకులు పరిస్థితి అయోమయంగా మారిందని, నిజంగా మీరు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుకి వచ్చి కండువా వేసుకోండని, అప్పుడు నమ్మతామని చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోలు పవన్ తెలియజేసారు. ప్రజలను మా పార్టీ నాయకులను కార్యకర్తలను అయోమయానికి గురి చేయవద్దని, ఇప్పటికైనా ఏదో ఒక పార్టీని నమ్ముకుని పని చేయండని అన్నారు.

# అక్రమంగా మొరం తవ్వకాలు. లక్షలు దండుకుంటున్న వ్యాపారాలు. కళ్ళు ముసుకున్న ప్రభుత్వ అధికారులు.



నిర్మల్ : లోకల్ గైడ్ :కుబీర్ మండలంలోని సేవదాస్ నగర్ గ్రామ శివారులో సోమవారం మహారాష్ట్ర జెసీబీ తో పాటు మూడు ట్రాక్టర్ లు అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నాయి. సంబంధిత అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కళ్ళు మూసుకుంటున్నట్లు వ్యవరించడంతో దర్జాగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయి. దింతో మండలంలో కూడా ఎలాంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులకు మాత్రం ఏమి తెలియనట్లు వ్యవరించడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మండలంలో ఉన్న ప్రభుత్వ భూములు, గుట్టల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తీసుకువెళ్తున్నారు.పట్టా భూములు అనుకుంటూ చెప్పి మొరం తవ్వకాలు జరుగుతున్నాయి.దింతో వ్యాపారులు ప్రభుత్వానికి గండి కొట్టి లక్షలు పోగుచేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరిచి చూడాలని, ప్రభుత్వ అదయానికి గండి పడకుండా ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకొవాలని పలువురు కోరారు

# యువతి అదృశ్యం



మహబూబ్ నగర్ జిల్లా సెప్టెంబర్ 8(లోకల్ గైడ్):నవాబుపేట్ మండలం పరిధిలోని కాకర్లపాడు గ్రామం చెందిన చాకలి సింధుజ, తండ్రి, వెంకటయ్య వయసు 18 సంవత్సరాలు, పదో తరగతి చదివి ప్రస్తుతం టైలర్ గా పని జీవనం కొనసాగిస్తున్నారు ఆదివారం ఉదయ10 ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఇరువైపులా చూడగా ఆచూకీ లభించక అదే గ్రామానికి చెందిన గడ్డమీద మహేష్, తండ్రి ఉషన్న అనే వ్యక్తిపై అవమానం ఉన్నట్లు తల్లి వసంత, తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రం తెలిపారు.

# రాబోతున్న స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్




వికారాబాద్ జిల్లా, లోకల్ గైడ్:సోమవారం జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లోని ఛాంబర్లో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయితీలలో ఓటర్ల జాబితా, జిల్లాలో 2025, జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటరు జాబితాననుసరించి గ్రామ పంచాయితీ, వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగింది.అలాగే పోలింగ్ బూత్ ల జాబితా, పోలింగ్ కేంద్రాల విషయం ఏవేని అభ్యంతరాలు ఉన్నట్లు అయితే తెలియజేయవచ్చని ఆయన తెలిపారు.జిల్లాలోని 594 గ్రామ పంచాయతీలలో 5058 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు . జిల్లాలో 6,98,478 ఓటర్లు నమోదు అయ్యారని, ఇందులో 343672 మంది పురుషులు, 354790 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీపీఓ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోదావరి తాగునీటిని తెస్తున్నాం - రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

## గండిపేట ఉస్మాన్ సాగర్ వద్ద రూ. 7360 కోట్లతో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి




రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోదావరి తాగునీటిని చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకోసం గండిపేట ఉస్మాన్ సాగర్ వద్ద రూ. 7360 కోట్ల వ్యాయామంతో ఫేస్ 1-2 గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వందేళ్లకు పైగా ఈ నగరానికి తాగు నీరు అందుతున్నాయంటే ఆనాటి నిజాం సర్కార్ దూరదృష్టినే కారణమన్నారు. కోటికిపైగా జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంతో కృషి చేశాయని గుర్తు చేశారు.1965 లో మంజీరా నది నుంచి, 2002 లో కృష్ణా నదీ జలాలను మూడు దశల్లో నగరానికి తరలించి ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదని



వివరించారు. కాంగ్రెస్ తెచ్చిన గోదావరి జలాలను నెత్తి మీద చల్లుకుని తామే ఏదో చేసినట్టు కొందరు నమ్మించారని, నెత్తిమీద నీళ్లు చల్లుకున్నంత మాత్రాన వాళ్ల పాపాలు తొలగిపోవని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే గోదావరి జలాల తరలింపునకు ముందడుగు పడిందని ముఖ్యమంత్రి తెలిపారు.కాలుష్యమయమైన మూసీతో నల్లగొండ జిల్లా వాసులు ఫ్లోరైడ్, ఇతర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విషతుల్యమైన మూసీని ప్రక్షాళన చేస్తానని నల్లగొండ జిల్లా ప్రజలకు ఆనాడే మాట ఇచ్చానని, ఇందుకోసం మూసి రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేశామని, ప్రక్షాళన చేసి తీరుతామని చెప్పారు. 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్ కు తరలించబోతున్నామని, ఇందులో 16 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి కోసం, 4 టీఎంసీల ను చెరువులను నింపుకుంటూ మూసీకి తరలించి మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు ఎందుకు మూసీ నది ప్రక్షాళన చేయలేదన్నారు.శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాలను హైదరాబాద్ తరలిస్తున్నాం, ఆ సంగతి మరిచిపోయి కొందరు మల్లన్నసాగర్ అని మాట్లాడుతున్నారని అన్నారు. తుమ్మిడిహెట్టీ దగ్గర ప్రాణహిత చేవెళ్ల కట్టి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు.ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేస్తామని, అభివృద్ధికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైసింగ్-2047 విజన్ డాక్యుమెంట్ ను డిసెంబర్ 9 న తెలంగాణ సమాజానికి అంకితం ఇస్తామని, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మా ప్రభుత్వం తిప్పికొడుతుందని ఆయన తెలిపారు. ఇది ఇందిరమ్మ రాజ్యం.. పేదోళ్ల రాజ్యం.. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.హైదరాబాద్ నగరానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, కోటిన్నరకు పైగా జనాభా ఉన్న నగరానికి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నాడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను తీసుకురావడం జరుగుతుందని అన్నారు. హైదరాబాద్ నగరానికి నిజాం అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. రాష్ట్రం వచ్చిన పదేళ్లలో గత ప్రభుత్వం గోదావరి నుంచి చుక్క నీరు అందించలేదన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ లో మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వం విఫలమైందని , మళ్లీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే జంటనగర వాసులకు తాగునీటికి ఇబ్బంది కలగకుండా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ బృహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా రాబోయే రెండేళ్లలో హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేలా అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నామని, వాటిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. భావితరాల కోసమే మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, నగరవాసులకు అంతర్జాతీయ జీవన ప్రమాణాలను అందించాలన్నదే మా సంకల్పమని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ చీఫ్ విప్ పి. మహేందర్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు టీ.ప్రకాష్ గౌడ్, రామ్మోహన్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ,

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, స్థానిక నాయకులు జైపాల్ రెడ్డి, ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

### ఇళ్లల్లో రెండు తాచుపాములు

# బంధించిన సంతోష్



కొత్తగూడెం(లోకల్ గైడ్) లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామపంచాయతీలో సోమవారం ఉదయం రజాక్ ఇంట్లోకి పాము చేరి కలకలం సృష్టించింది గత కొన్ని రోజులుగా పెంచుకుంటున్న కోళ్లను కాటు వేస్తూ చంపేస్తుంది కోళ్ల శబ్దం విన్న యజమాని గమనించడంతో తాచుపాము బుసలు కొడుతూ పైకి లేచింది. వెంటనే ప్రాణధార ట్రస్ట్ అధ్యక్షుడు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ కు సమాచారం ఇవ్వగా వెంటనే వెళ్లి కోళ్ల గూడు మాటన నక్కి ఉన్న తాచుపామును చాకచక్యంగా పట్టుకుని బంధించి స్థానికులకు సర్పాల భద్రతపై అవగాహన కల్పించాడు.

సాయంత్రం సైతం శ్రీనగర్ కాలనీ నాలుగవ లైన్ లో ఓ ఇంట్లో బాత్రూంలో తాచుపాము వచ్చిందని సమాచారంతో సంతోష్ వెళ్లి దానిని సైతం బంధించి వాటిని రిజర్వ్ ఫారెస్ట్ కు తరలించారు.

## ఈ నెల 13న జాతీయ మెగా లోక్ అదాలత్,లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌లి.




హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్):ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు,బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందని, కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలియజేశారు.

# ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులే

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### హనుమకొండలో ఘనంగా సురవరం సంస్మరణ సభ




హనుమకొండ జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్):ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, షేక్ బాష్ మియా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు ఎలాంటి మచ్చ ఉండని నిస్వార్థ పరులని, సురవరం, సీతారాం ఏచూరి, గద్దర్ లాంటి వారు మరణించినప్పుడు ప్రజలు నీరాజనాలు పలికారని అన్నారు.త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సీపీఐ నిలబడిందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నుండి సెక్యులర్, సోషలిజం పదాలను తొలగిస్తూ ఈసీ, సీబీఐ లాంటి సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రశ్నించే వారిని అణిచివేసే చర్యలు చేపడుతున్నదని అన్నారు. అలాంటి వారికి ఎర్రజెండా అంటే భయమని, దేశంలో కమ్యూనిజాన్ని లేకుండా చేయాలనుకుంటున్నారని అన్నారు. దేశంలో కమ్యూనిష్టులందరూ ఏకం కావాలని, ఎర్రజెండాలన్నీ ఒకే జెండాగా మారాలని అందరూ కోరుకుంటున్నారని అన్నారు. ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించడమే సురవరం కు నిజమైన నివాళి అని అన్నారు. ఈ నెల 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణా సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టులు బడుగు, బలహీన వర్గాల కోసమే పోరాడుతారని, పేద ప్రజల పట్ల కమ్యూనిస్టులకు ఎంతో అంకితభావం ఉంటుందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, హక్కుల సాధనలో కమ్యూనిస్టులు ముందుంటారని అన్నారు. మనువాద భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్న బీజేపీని తరిమికొట్టేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి లేని లోటు వామపక్షాలతో పాటు ప్రజలకు తీరని లోటు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో సురవరం కు అనుబంధం ఉందని, పలు భూపోరాటాలకు సహకారం అందించారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పరేట్ వర్గాల కోసమే పనిచేస్తున్న దని అన్నారు. దేశంలో భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు టి. వెంకట్రాములు, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, వలి ఉల్లా ఖాద్రి,టి.విశ్వేశ్వర్ రావు, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, సీపీఎం నాయకులు ఆరూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బీఆర్ఎస్సేమీడియాతో కూనంనేని సాంబశివరావు రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బీఆర్ఎస్సేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండలో ఆయన మీడియాతో



మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. ఏ పార్టీ వారయినా పార్టీ మారగానే సభ్యత్వం రద్దు చేయాలని, ఇందుకు పార్టీ ఫిరాయింపుల చట్టంలోనే మార్పులు రావాలని సూచించారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి పై నిష్పక్షపాతముగా విచారణ జరుపాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సీబీఐ పై నమ్మకం పోయిందని, కేంద్రం కనుసన్నల్లో కాకుండా సీబీఐ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు

